# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం-22- డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 204 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# ఇవాళ్టి వరకు వేరు.. రేపటి నుంచి వేరే

## కాంగ్రెస్ సర్కార్‌పై భారీ ప్రజా ఉద్యమం: కేసీఆర్

- అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై రాజీ లేదు
- గోదావరి జలదోపిడీపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- కేంద్ర–రాష్ట్ర వైఖరిపై ప్రజా ఉద్యమానికి శ్రీకారం
- గ్రామ గ్రామాన డప్పు కొట్టి కార్యాచరణ
- బహిరంగ సభల్లో ప్రభుత్వ నిష్క్రియ బయటపెడతాం
- పెట్టుబడుల పేరుతో ప్రజలను మోసం
- ఫార్మాసిటీ భూముల అమ్మకంపై తీవ్ర విమర్శలు



**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** 'క్రమ పద్ధతిలో ముందుకు సాగుతున్న రాష్ట్రం లో ప్రజలను అబద్ధపు హామీలతో మోసగించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మాయమాటలతో అర్రాజ్ పాటలు పాడి చాంతాడంత హామీలు ఇవ్వడంతో ప్రజలు టెంప్ట్ అయ్యా రు. వంద శాతం సమ్మిళిత అభివృద్ధితో ముందుకు సాగుతున్న తెలంగాణలో బాండు పేపర్లు, గ్యారంటీ కార్డులు అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలకు శఠగోపం పెట్టారు. ఇది సర్వభ్రష్ట ప్రభుత్వం. నదుల అనుసంధానం పేరిట గోదావరి జలదోపిడీ, పాలమూరు ఎత్తిపోతలకు అన్యాయం జరుగుతున్నా స్పందించడం లేదు. కిరికిరి మాటలతో, కారు కూతలతో ప్రభుత్వం నడుపుతామంటే కుదరదు.

మాది తెలంగాణ తెచ్చిన పార్టీ. ప్రధాన ప్రతిపక్షంగా మా విధి మేము నిర్వర్తించాలి. సర్కారుకు సరిపడినంత సమయం ఇచ్చాం. ఇవాళ్టి వరకు వేరు, రేపటి నుంచి వేరే.. తోలు తీస్తాం.. అందుకోసం నేను రంగంలోకి దిగుతున్నా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు భారీ ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నాం. మూడు నాలుగు

మిగతా 2లో



# 'నీళ్ల–నిజాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం

## కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్'

- కృష్ణా–గోదావరి జలాలపై అసెంబ్లీలో రెండు రోజుల చర్చకు సిద్ధం
- జనవరి 2 నుంచే సభలు నిర్వహించేందుకు ప్రభుత్వం రెడీ
- బహిరంగ సభలు కాదు... శాసనసభకు రావాలని కేసీఆర్‌కు ఆహ్వానం
- సభలో గౌరవమర్యాదలకు భంగం కలగనివ్వం: సీఎం
- నీళ్ల–నిజాలపై ముఖాముఖి చర్చిద్దాం
- అధిక వడ్డీ అప్పులపై కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు
- కేసీఆర్ కుటుంబంలో అంతర్గత కలహాలు
- కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్న ఆరోపణ
- పాలమూరు–రంగారెడ్డి డీపీఆర్‌పై తప్పిదాల ప్రస్తావన
- కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టులపై భారీ ఖర్చు అంటూ వెల్లడి

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** కృష్ణా, గోదావరి జలాలపై అవసరమైతే రెండేసి రోజుల చొప్పన శాసనసభలో చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చర్చలకు వస్తానని ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అంగీకరిస్తే జనవరి 2 నుంచే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదివారం సాయంత్రం తన నివాసంలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడారు. "జనవరి 2న సభకు వస్తానని కేసీఆర్ చెప్పకపోయినా... జనవరిలో అసెంబ్లీ శీతాకాల సమావేశాల ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో చర్చించి తేదీలు నిర్ణయిస్తాం. అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలపై చర్చించాలని కేసీఆర్‌ను అడుగుతుంటే బహిరంగ సభలకు వెళ్తానంటున్నారు.

2లో



# వరంగల్‌లో ఎన్ఐఏ సోదాలు

## మాజీ మావోయిస్టు గాదె ఇన్నయ్య అరెస్ట్

- గాదె ఇన్నయ్య ఇల్లు, ఆశ్రమంలో తనిఖీలు
- మావోయిస్టులతో సంబంధాలపై కేసు నమోదు
- యూట్యూబ్ ఛానల్‌పైనా ఎన్ఐఏ కేసు
- నాలుగు వాహనాల్లో వచ్చిన ఎన్ఐఏ బృందం
- ఇన్నయ్యను అదుపులోకి తీసుకున్న అధికారులు
- అరెస్టును అడ్డుకున్న చిన్నారులు

2లో

# 'ఇరిగేషన్‌ను నాశనం చేసింది కేసీఆరే అబద్ధాలే 90 శాతం

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్

- రూ.1.80 లక్షల కోట్ల ప్రాజెక్టుతో రైతులకు లాభం లేదు
- కమీషన్ల కోసమే కాళేశ్వరం అంచనా పెంచారన్న విమర్శ
- డ్యామ్ సేఫ్టీ అథారిటీ, సుప్రీంకోర్టు జడ్జి వ్యాఖ్యల ప్రస్తావన
- ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులపై సమాధానం చెప్పాలన్న డిమాండ్
- కృష్ణా జలాల కోసం ట్రైబ్యునల్‌లో పోరాటం కొనసాగుతోంది





# అంబేద్కర్ ఆశయాల కొనసాగింపులో యువత ముందుండాలి

## ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

- పల్లిమక్తలో అంబేద్కర్ భవన ప్రారంభోత్సవం
- బోధించు–సమీకరించు–పోరాడు స్ఫూర్తి గుర్తుచేసిన ఎమ్మెల్యే
- వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి హామీ
- మల్కపేట రిజర్వాయర్ ద్వారా సాగునీటి సరఫరా

8లో

# ఆరు గ్యారంటీల అమలేమైంది?

## సోనియాగాంధీకి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ

- 2023 ఎన్నికల హామీల అమలుపై కిషన్‌రెడ్డి ప్రశ్నలు
- సోనియా, రాహుల్, ప్రియాంకా ఇచ్చిన ఆరు గ్యారంటీల ప్రస్తావన
- విజన్ డాక్యుమెంట్ పేరిట కొత్త హామీలపై విమర్శ
- గ్యారంటీలను గాలికొదిలేశారా? అంటూ ఘాటు వ్యాఖ్యలు
- రైతులు, మహిళలు, నిరుద్యోగులపై కాంగ్రెస్ వైఖరి ఏంటి?
- 420 ఎన్నికల హామీల అమలుపై స్పష్టత కోరిన లేఖ
- గత హామీలను ముందుగా నెరవేర్చాలన్న డిమాండ్



**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** ssరాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీ ప్రజలకు 6 గ్యారంటీలు ఇచ్చారని, అవి అమలవుతున్నాయా లేదా అన్నది ఎందుకు పట్టించుకోవడం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈమేరకు ఆదివారం సోనియా గాంధీకి ఆయన బహిరంగ లేఖ రాశారు. "తెలంగాణ రైజింగ్ 2047 పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీకి వచ్చి విజన్ డాక్యుమెంట్‌ను మీకు అందించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీల అమలు గురించి తెలుసుకోవడానికి మీరు ప్రయత్నించినట్లు కూడా లేదు. ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన మీరు..

మిగతా 2లో

# 'నదీజలాల సమస్యలకు కేసీఆర్, హరీశ్‌రావు తప్పిదాలే కారణం'

- వృథా ప్రాజెక్టులతో రాష్ట్రానికి భారీ నష్టం
- కేసీఆర్ అసెంబ్లీకి రావాలన్న కాంగ్రెస్ డిమాండ్
- కవిత అంశం, అప్పులపై కేసీఆర్ వివరణ కోరిన మహేష్‌గౌడ్
- ప్రతిపక్షాల అవసరం ఉందన్న కాంగ్రెస్ స్పష్టత
- పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం కాంగ్రెస్ విజయం
- తెలంగాణపై కిషన్‌రెడ్డి వైఖరిపై మండిపాటు
- కేంద్ర పాలనపై బహిరంగ చర్చకు సవాల్
- మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణకు అడ్డంకుల ఆరోపణ
- బీఆర్ఎస్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ప్రతిస్పందన



**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** కేసీఆర్, హరీష్ రావు చేసిన తప్పిదాల వల్లే తెలంగాణ రాష్ట్రంలో నదీజలాల సమస్యలు ఉత్పన్నమైనాయని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ విమర్శించారు. వృథా ప్రాజెక్టుల కోసం కేసీఆర్ అనవసరపు ఖర్చు చేశారని ఆరోపించారు.

మిగతా 8లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# ఇవాళ్టి వరకు వేరు.. రేపటి నుంచి వేరే

(మొదటి పేజీ తరువాయి)

రోజుల్లో ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లా నేతలతో సమావేశమై గ్రామ గ్రామాన డప్పు కొట్టి కార్యాచరణ ప్రకటిస్తాం.

ఆయా జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించి ప్రభుత్వ నిష్క్రియా పరత్వాన్ని ఎండగడ□తాం. కవులు, కళాకారులను తట్టి లేపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రశ్నిస్తాం. ఈ సభలకు నేను స్వయంగా హాజరవుతా..' అని భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షులు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గం, శాసనసభా పక్షం, పార్లమెంటరీ పార్టీ, ఇతర కీలక నేతలతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

'పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో తట్టెడు మట్టి తీయకుండా రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యా పరత్వం, కేంద్రం వ్యతిరేకిస్తున్న తీరును రెండేళ్లుగా గమనిస్తున్నాం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదు. తెలంగాణ ప్రజల కోసమే పుట్టిన బీఆర్ఎస్..తెలంగాణ హక్కులకు ఒక్క నొక్కు పడినా, ఒక్క చుక్క నష్టం జరిగినా సహించేది లేదు.

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు ఒత్తిడితో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను వెనక్కి పంపారు. పర్యావరణ అనుమతులతో పాటు ఇతర ప్రధాన అనుమతులు సాధించినా బీజేపీ దిగజారి తెలంగాణకు శనిలా మారింది. మూడు ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన ప్రాజెక్టు డీపీఆర్‌ను వెనక్కి పంపి ఆగం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందన లేకుండా పెదవులు మూసుకుంది. మైనర్ ఇరిగేషన్ నష్టాలు, ఏపీ పట్టిసీమ



ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాల తరలింపుతో కృష్ణాలో తెలంగాణకు దక్కిన 45 టీఎంసీలను కలుపుకొని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 90.81 టీఎంసీలు కేటాయించాం. కానీ నీటిపారుదల శాఖ మంత్రి 45 టీఎంసీలు చాలని లేఖ రాశారు. గోదావరి జలాల తరలింపుతో కృష్ణాలో ఏపీ వదులుకున్న జలాలను ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర వాడుకుంటుంటే తెలంగాణ ప్రభుత్వం నిద్రపోతోంది. రెండేళ్లుగా పాలమూరు ప్రాజెక్టులో తట్టెడు మట్టెడు తీయకుండా ఎవరు అడ్డుకుంటున్నారు? ఈ ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ దందా, కమీషన్లు కొట్టడం తప్ప వేరే పనిలేదా?..' అని కేసీఆర్ మండి పడ్డారు.

'సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, టీడీపీ పాలనలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోలుకోలేని రీతిలో దెబ్బతింది. నాటి సీఎం చంద్రబాబు జిల్లాను దత్తత తీసుకున్నా జూరాలలో ముంపునకు గురైన కర్ణాటక భూమికి రూ.13 కోట్లు పరిహారం ఇవ్వలేదు. గోదావరి నదిపై దేవునూరు, ఇచ్చంపల్లి తదితర ప్రాజెక్టులకు ఉమ్మడి ఏపీలో అన్యాయం చేసిన రీతిలోనే కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాకు నష్టం చేశారు. 17 టీఎంసీలతో మంజూరైన జూరాల ప్రాజెక్టు దశాబ్దాల తరబడి కనీసం ఫౌండేషన్‌కు నోచుకోలేదు. టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత.. చంద్రబాబు మోకాళ్ల మీద పరుగెత్తి పరిహారం చెల్లించడంతో జూరాల ప్రాజెక్టు ఆయకట్టు సాగులోకి వచ్చింది.

రాజోలిబండ మళ్లింపు పథకం కోసం ఆలంపూర్, గద్వాల వరకు పాదయాత్ర చేశా. మహబూబ్‌నగర్ జిల్లాలో 308 కిలోమీటర్ల మేర కృష్ణా ప్రవహిస్తున్నా నెట్టెంపాడు, బీమా, కల్వకుర్తి తదితర పథకాలను పెండింగులో పెట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే పెండింగు ప్రాజెక్టులను పూర్తి చేసి రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం. పాలమూరు ఎత్తిపోతల పథకానికి 170కి పైగా టీఎంసీలు తీసుకోవాలనే వ్యూహంతో తొలుత 90.81 టీఎంసీలు కేటాయించాం. అనేక అవాంతరాలు ఎదురైనా అనుమతులు సాధించాం. రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తి చేశాం..' అని బీఆర్ఎస్ అధినేత వెల్లడించారు.

'బిజినెస్ మీట్‌ల పేరిట హైప్ క్రియేట్ చేయడంలో గురువు చంద్రబాబు. ఏపీలో చంద్రబాబు హోటల్‌లో పనిచేసే వంట మనుషులతో ఎంఓయూలపై సంతకాలు పెట్టించారు. ఆయన చెప్పిన లెక్కలు నిజమైతే ఈ పాటికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేవి. ఒప్పందాలు నిజమైతే కనీసం రూ.10 వేల కోట్లయినా రావాలి కదా. గతంలో నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు భోపాల్‌కు వెళ్లిన సందర్భంలో ప్రధాని మోదీ సమక్షంలో కుదిరిన రూ.14 లక్షల కోట్ల ఎంఓయూలు బోగస్ అని ఆ రాష్ట్ర మంత్రి చెప్పారు. పెట్టుబడులపై అబద్ధపు ప్రకటనలు, ఒప్పందాలతో ప్రజలను మోసం చేయడం ఎందుకు?..' అని కేసీఆర్ ప్రశ్నించారు.

'ఫార్మా రంగానికి ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని కాలుష్య రహిత ఫార్మా సిటీ ఏర్పాటు కోసం ముచ్చర్లలో మేం 14 వేల ఎకరాలు సేకరించాం. పర్యావరణ అనుమతులు కూడా సాధించి ముందుకు సాగుతున్న క్రమంలో ప్రభుత్వం మారింది. కానీ ఫ్యూచర్ సిటీ పేరిట భూములను అమ్ముకునేందుకు రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందాకు తెరలేపారు. గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రాణాలను కాపాడలేని ప్రభుత్వం ఫార్మాసిటీ భూములను అమ్ముకునేందుకు ఉత్సాహం చూపుతోంది.

వంతారాకు 3 వేల ఎకరాలు, జూపార్కు తరలింపు భూముల అమ్మకం కోసమేనా? గ్లోబల్ సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ ప్రజలను ఎంత కాలం వంచిస్తారు? యాప్ ద్వారా యూరియా అంటూ రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారు. మేము ప్రజల ఆస్తుల విలువ పెంచితే ప్రస్తుతం భూముల ధరలు కుప్పకూలాయి. అడ్డమైన హామీలు ఇచ్చి రైతులు, పేదలు, విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులను ఏడిపిస్తున్నారు. సందర్భం ఏదైనా కేసీఆర్ చనిపోవాలి అంటూ మాట్లాడటం కరెక్టేనా?..' అని కేసీఆర్ నిలదీశారు.

# 'నీళ్ల –నిజాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)



బాధ్యత కలిగిన ప్రతిపక్ష నేతలా శాసన సభకు వచ్చి చర్చించాలని కేసీఆర్‌ను మేం ఆహ్వానిస్తున్నాం. సభలో ఆయన గౌరవమర్యాదలకు ఎలాంటి భంగం కలగకుండా చూసే బాధ్యత మాది. ఆయన గౌరవానికి భంగం కలిగేలా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని కూడా సభాపతికి విన్నవిస్తాను. నీళ్లునిజాలపై ఎవరేం చేశారనేది సభావేదికగా ముఖాముఖి చర్చిద్దాం. కేసీఆర్ తన అనుభవంతో రాష్ట్రానికి ఉపయోగపడే ఏ సూచన చేసినా ప్రభుత్వం ఆమోదిస్తుంది. కేసీఆర్‌కు వంతపాడేవారితో చర్చలకు సిద్ధంగా లేం. సభకు రాని కేసీఆర్ ప్రతిపక్ష నేతగా ఉండాలా వద్దా అనేది భారాస నిర్ణయించుకోవాలి. ఆయన ఆరోగ్యం ఎలా ఉందని భారాస ఎంపీలను మోదీ అడగగానే కేసీఆర్‌కు ఉత్సాహం వచ్చింది. లోక్‌సభ ఎన్నికలు, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల ఫలితాలను చూసిన తర్వాత ప్రతిపక్ష నేత హోదా గుర్తుకొచ్చింది.

కేంద్ర ప్రభుత్వంతో పనులు చేయించుకోవడానికే దిల్లీకి వెళుతున్నా. కేంద్రంతో మాట్లాడటం వల్లే కేసీఆర్ గతంలో అధిక వడ్డీలకు తెచ్చిన రూ.26 వేల కోట్ల అప్పులను తీర్చేందుకు అనుమతి ఇచ్చింది. అధిక వడ్డీలపై తెచ్చిన మరో రూ.85 వేల కోట్ల అప్పులను తీర్చడానికి తక్కువ వడ్డీకి రుణాలను పొందేందుకు అనుమతించాలని ఇటీవల కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరాను. తక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి, అధిక వడ్డీలకు తెచ్చినవాటిని కట్టేస్తే ఏటా రూ.4 వేల కోట్ల ఆర్థిక భారం తగ్గుతుందని భావిస్తున్నాం. కేసీఆర్ రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేశారు. 12% వడ్డీలకు అప్పులు తెచ్చి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు.

కేసీఆర్‌కు ఆయన కుటుంబం నుంచే ప్రమాదం పొంచి ఉంది. కుమారుడు కేసీఆర్ కుర్చీ కోసం, అల్లుడు ఆస్తుల కోసం కొట్లాడుకుంటున్నారు. అల్లుడి చేతిలోకి పార్టీ పోతుందన్న భయంతోనే కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చారు. కేసీఆర్ ఉన్నంతకాలం హరీశ్‌రావు ఎక్కడికీ పోరు. పార్టీతో పాటు పార్టీ ఆస్తులపై ఆయన కన్నేశారు. కానీ, భారాసను కేటీఆర్ చేతిలో పెట్టాలని కేసీఆర్ భావిస్తున్నారు. నేను కోటి మంది మహిళలకు చీర, సారె ఇచ్చి గౌరవిస్తే కేసీఆర్ కుటుంబం మాత్రం కవితను పార్టీ నుంచి బయటకు పంపింది.

కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే మహబూబ్‌నగర్ జిల్లా. కృష్ణా జలాల్లో వాటా కోసమే తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది. సమైక్య రాష్ట్రంలో కంటే కేసీఆరే తన పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం చేశారు. ఆయన హయాంలోనే ఏపీ జలదోపిడీ జరిగింది. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాగా 299 టీఎంసీలు చాలని ఆయన సంతకాలు పెట్టి.... ఉమ్మడి పాలమూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు మరణశాసనం రాశారు. కృష్ణా జలాలపై ఏపీకి శాశ్వతంగా హక్కులు రాసిచ్చారు. అందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలి. కృష్ణా నది తెలంగాణలోకి ప్రవేశించే జూరాల నుంచి కాకుండా బాగా దిగువన ఉన్న శ్రీశైలంపై నుంచి పాలమూరురంగారెడ్డికి నీళ్లు తీసుకోవాలనే ప్రణాళికతో అన్యాయం చేశారు. పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి లాంటి ప్రాజెక్టులను ఏపీ నిర్మించుకున్నా పట్టించుకోలేదు. గోదావరి జలాలను అటు ఇచ్ఛాపురం వరకూ, ఇటు నాయుడుపేట, రాయలసీమలకు తరలించుకుపోవాలంటూ చంద్రబాబుకు సలహా ఇస్తూ... పట్టిసీమను కట్టినందుకు అభినందిస్తూ కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడిన వీడియో ఉంది. భారాస సభలు పెట్టే ప్రతి ఊర్లోనూ దాన్ని ప్రజల ముందు ప్రదర్శిస్తాం.

భారాస పాలనలో సాగునీటి ప్రాజెక్టులపై రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టి, వాటిలో రూ.1.80 లక్షల కోట్ల బిల్లులు చెల్లించారు. అయినా పదేళ్లలో ఎస్ఎల్‌బీసీ, డిండి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదాన్నీ భారాస ప్రభుత్వం పూర్తి చేయలేదు. వాటిని పూర్తి చేసిఉంటే తెలంగాణకు కృష్ణా జలాల్లో అధికంగా నీటిని వాడుకునే అవకాశం దక్కి ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులపై రూ.6,800 కోట్లు ఖర్చు చేశాం.

భారాస ప్రభుత్వం పాలమూరురంగారెడ్డి డీపీఆర్‌ను సరిగా రూపొందించకపోవడంతోనే కేంద్రం వెనక్కి పంపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం ఆపాలని ఎన్జీటీలో కేసులు వేసిన బీరం హర్షవర్ధన్‌రెడ్డికి అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ కొల్లాపూర్ టికెట్ ఇచ్చారు. కృష్ణా జలాల్లో ఏపీకి 64%, తెలంగాణకు 36% వాటా ఇస్తే చాలని కేసీఆర్ సంతకం చేసి... కాంట్రాక్టులు, కమీషన్లకు అమ్ముడుపోయారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణా నది పరీవాహక ప్రాంతం లెక్కల ప్రకారం నదీ జలాల్లో 71% వాటా కావాలని పోరాడుతున్నాం. కేసీఆర్ 50% కూడా అడగలేదు. మొత్తం 94 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికలు జరిగితే 87 చోట్ల కాంగ్రెస్ మద్దతుదారులు నెగ్గారు. నిజనిర్ధారణ కమిటీ వేసి ఏ గ్రామానికైనా వెళ్లి పరిశీలిద్దాం. ఏ పార్టీ మద్దతుదారులు సర్పంచులుగా గెలిచారో తేలుద్దాం. యూరియా కోసం యాప్‌ను ప్రవేశపెట్టి అధునాతన టెక్నాలజీని వాడతామని చెపితే కేసీఆర్ భరించలేకపోతున్నారు'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# 'ఇరిగేషన్‌ను నాశనం చేసింది కేసీఆరే అబద్ధాలే 90 శాతం

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కి తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇరిగేషన్‌ను నాశనం చేసింది కేసీఆరేనని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇరిగేషన్‌పై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు 90శాతం అబద్ధమని అన్నారు. కాళేశ్వరం తెలంగాణకు గుండెకాయ అన్నారని.. అది కూలిపోయిందని చెప్పుకొచ్చారు.

రూ.1. 80వేల కోట్లతో కట్టిన ప్రాజెక్టు వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం జరగలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోవడానికి కారణం.. కేసీఆరేనని ఫైర్ అయ్యారు. ప్రజల భవిష్యత్తును ఆయన తాకట్టు పెట్టారని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణం తీరును డ్యామ్ సేఫ్టీ అథారిటీ, సుప్రీంకోర్టు జడ్జి కూడా తప్పుపట్టారని ప్రస్తావించారు. కూలిపోయిన ప్రాజెక్టులు కట్టి ఇరిగేషన్ గురించి కేసీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.




రూ.38,500 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు ఎందుకు పెంచారని ప్రశ్నల వర్షం కురిపించారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా పెంచారని ఆరోపించారు. రూ.18 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టు నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. రూ. లక్షల కోట్ల అప్పుతెచ్చి కూడా ప్రాజెక్టు పూర్తి చేయలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందున్న పెండింగ్ ప్రాజెక్టులు కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదు? అని ప్రశ్నించారు. SLBC, డిండి ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలు అడుగుతున్నారని.. కేసీఆర్ వెంటనే సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చామని తేల్చిచెప్పారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పచ్చి అబద్దాలు మాట్లాడటం సరికాదని హితవు పలికారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

కృష్ణా జలాల కోసం గట్టిగా ట్రైబ్యునల్‌లో పోరాడుతున్నామని పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.7 వేల కోట్లు ఖర్చు పెట్టామని వివరించారు. ఈ ప్రాజెక్టుకు 90 టీఎంసీల కంటే తక్కువ అడగ లేదని అన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రద్దు చేసి రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ తప్పుల వల్లే ఇరిగేషన్ వ్యవస్థ నాశనమైందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.



# ఆరు గ్యారంటీల అమలేమైంది?

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు విజన్ డాక్యుమెంట్ పేరిట మళ్లీ కొత్త హామీలు ఇస్తున్నారు. గ్యారంటీలను గాలికొదిలేశారో, ఎన్నికల ప్రణాళికలోని 420 హామీలను మూసీలో కలిపేశారో లేక గాంధీభవన్‌లో పాతరేశారో తెలంగాణ ప్రజలకు తెలియజేయాలి. గ్యారంటీల పేరుతో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన హామీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలి. కొత్త ఆశలు కల్పించేముందు గతంలో ఇచ్చిన హామీల అమలుపై ఇచ్చిన మాట మీద నిలబడాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారు. లేదంటే ప్రజల ఆగ్రహం మీ పాలిట భస్మాసుర హస్తమై మిమ్మల్ని అధికారానికి దూరం చేస్తుంది'' అని కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# వరంగల్‌లో ఎన్ఐఏ సోదాలు మాజీ మావోయిస్టు గాదె ఇన్నయ్య అరెస్ట్

**వరంగల్ , (తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్ జిల్లాలో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేపట్టారు. మాజీ మావోయిస్టు గాదె ఇన్నయ్య ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. జనగామ జిల్లా జాఫర్‌గఢ్ గాదె ఇన్నయ్య ఆశ్రమంలోనూ ఎన్ఐఏ సోదాలు చేపట్టింది. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై సోదాలు చేపట్టిన ఎన్ఐఏ అధికారులు.. గాదె ఇన్నయ్యతో పాటు యూట్యూబ్ ఛానల్‌పై కేసు నమోదు చేశారు. ఆదివారం..నాలుగు వాహనాల్లో వచ్చిన ఎన్ఐఏ అధికారులు.. ఇన్నయ్యను అదుపులోకి తీసుకున్నారు. ఇన్నయ్యను అరెస్ట్ చేసేందుకు ఆశ్రమానికి వచ్చిన ఎన్ఐఏ అధికారులను చిన్నారులు అడ్డుకున్నారు. ఇటీవల మృతిచెందిన



మావోయిస్టు నేత కాతా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ అంత్యక్రియలకు ఇన్నయ్య హాజరయ్యారు. సంస్మరణ సభలో మావోయిస్టులకు అనుకూలంగా వ్యాఖ్యలు చేసి ప్రజలను ప్రేరేపించారని దర్యాప్తులో తేలింది. మావోయిస్టులకు అనుకూలంగా వ్యాఖ్యలు చేయడంతో పాటు ప్రధాని, కేంద్ర హోంమంత్రిపై ఇన్నయ్య అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇన్నయ్య అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టుకు తరలించినట్లు సమాచారం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
సోమవారం - 22 - డిసెంబర్ 2025


# రాజకీయ సైద్ధాంతిక శిక్షణ అవసరం




◆ జనసేవా దళ్ శిక్షణను ప్రారంభిన బాగం హేమంతరావు ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 21(తెలంగాణ ముచ్చట్లు):** యువతలో శారీరక ధృడత్వం తో పాటు మానసిక పరివర్తన, సమాజం పట్ల అవగాహన అవసరమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ముఖ్య అతిథిగా హాజరైన ఇన్ స్పెక్టర్ పంజాల రమేష్ జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్, బాగం హేమంతరావు సిపిఐ జాతీయ సమితి సభ్యులు, ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర ఇన్చార్జి తెలిపారు. సమకాలిన పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ సైద్ధాంతిక శిక్షణ పొందాలని ఆయన సూచించారు. ఖమ్మం ఖమ్మం రూరల్ ఏదులాపూరం మున్సిపల్ పరిధిలో జనసేవా దళ్ శిక్షణా శిబిరం ఆదివారం ప్రారంభమైంది. శిక్షణను బాగం హేమంతరావు ప్రారంభించారు. ముందుగా ఏఐవైఎఫ్ జెండాను ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ననాబాల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దండి సురేష్, బాగం హేమంతరావు మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా కలిగిన యువత పాలక వర్గాల తీరుతో నైరాశ్యానికి గురవుతుందన్నారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనలో పాలకులు విఫలం కావడంతో యువశక్తి నిర్వీర్యమవుతుందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో యువత చైతన్యవంతమైన ఆలోచనలతో రాజకీయాల్లోకి రావాలని వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులకు మద్దతుగా నిలవాల్సి ఉందన్నారు. నిరుద్యోగం పెరిగిన నేపథ్యంలో పాలకులు కర్మ సిద్ధాంతాన్ని బోధిస్తూ పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. సుదీర్ఘ కాలం పోరాటాలతో అనేక హక్కులను, సంక్షేమ పథకాలను సాధించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జనవరి 18న ఖమ్మంలో జరుపుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఐదువేల మంది యువకులకు జనసేవాదళ్ శిక్షణ ఇస్తుమన్నారు. శారీరకంగా ధృడత్వం కలిగి ఉన్నప్పుడే మానసిక పరిపక్వత లభిస్తుందని శారీరక ధృడత్వం కలిగి సమాజ ఉన్నతికి కృషి చేయాలని ఆయన యువతను కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేస్తూ సమస్యలపై జరిగే పోరాటాలకు సంబంధించి కార్యోన్ముఖులను చేయడమే లక్ష్యంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామని బాగం హేమంతరావు, దండి సురేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు గణపారపు ఉపేందర్, మామిడాల కిరణ్ ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, సిపిఐ ఖమ్మం జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, సిపిఐ రూరల్ మండల కన్వీనర్ దండి రంగరావు, సిపిఐ ఖమ్మం రూరల్ మండలం నాయకులు వెన్నం భాస్కర్ మిడకంటి పెద్ద వెంకట్ రెడ్డి, రైతు సంఘం నాయకులు మామిడి శంకర్ రెడ్డి, 31వ డివిజన్ కార్యదర్శి దొంతగని వెంకన్న, మండల నాయకులు గణపరపు వీరన్న, రైతు సంఘం సీనియర్ నాయకులు మామిండ్ల నిరంజన్ రెడ్డి,మండల నాయకులు పొన్నెకంటి రామకృష్ణ సిపిఐ సీనియర్ ఏఐవైఎఫ్ నాయకులు దొంతగాని ఉపేందర్, మండల ఏఐవైఎఫ్ సహాయ కార్యదర్శి, రెడ్డబోయిన వెంకటేష్, దండి రమేష్ ఏఐవైఎఫ్ మండల నాయకులు, మెల్లెచెరువు రవి,ఎఐటియుసి జిల్లా నాయకులు మెల్లెచెరువు గురవయ్య, మేళ్ళచెరువు సాయి ఏఐవైఎఫ్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి



**మల్లాపూర్, డిసెంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** మల్లాపూర్ డివిజన్ నరసింహనగర్ కాలనీలో విక్రమాదిత్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజా కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి కటాక్షం ప్రజలందరిపై ఉండాలని, ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కప్పర సాయి గౌడ్, ఎస్.వి. కిట్టు, టిల్లు ముదిరాజ్, వల్లపు శ్రీకాంత్ యాదవ్, జానీ చారి, లడ్డు, ఫిరోజ్ ఖాన్, ప్రభు, హరీష్, వినీష్ యాదవ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

# కరాటే ఆత్మరక్షణకు ఎంతో అవసరం కార్పొరేటర్ ప్రభుదాస్





**కాప్రా, డిసెంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ మీర్పేట్ హెచ్. బి కాలనీ డివిజన్ భవాని షోటోకన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ కార్యక్రమానికి కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ, పిల్లలు చదువులతో పాటు కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌ను నేర్చుకోవడం ఆత్మరక్షణకు ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు మార్షల్ ఆర్ట్స్‌లో నైపుణ్యం సాధించాలని సూచించారు. కరాటే నేర్చుకోవడం ద్వారా శారీరకంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా దృఢంగా తయారవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ కత్తుల పృథ్వీ కుమార్, నాయకులు కత్తుల రాజ్ కుమార్, సింగపాక లింగం, కొయ్యడ జయపాల్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో కరాటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరై పోటీలను ఉత్సాహంగా వీక్షించారు.

# హనుమాన్ నగర్‌లో త్వరలో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



◆ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

**నాచారం, డిసెంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ నాచారం డివిజన్ హనుమాన్ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ సమస్యలతో బస్తీవాసులు చాలా కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు స్థానికులు నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌ను విన్నవించుకున్నారు.దీనిపై స్పందించిన కార్పొరేటర్ ప్రత్యేక చొరవతో, ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ద్వారా ఏప్రిల్ నెలలో డ్రైనేజీ నిర్మాణానికి రూ.25 లక్షల నిధులను మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియ పూర్తై, పైపులు తెప్పించే వరకు కొంత ఆలస్యం జరిగినప్పటికీ, పనులు త్వరగా ప్రారంభించేందుకు కార్పొరేటర్ కృషి ఫలించింది.డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన సందర్భంగా బస్తీవాసులు కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. రెండు నుంచి మూడు రోజుల్లో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. డ్రైనేజీ పనులు పూర్తయ్యాక వెంటనే సిమెంట్ రోడ్ల నిర్మాణం కూడా చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, సుజాత, రవి, మనోజ్, మల్లేష్, సుమిత్ర, నీలమ్మ, విజయ, దిలీప్, నజీర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# చిల్కానగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన




ఎమ్మెల్యే బండారి – కార్పొరేటర్ బన్నాల

**చిల్కానగర్, డిసెంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో మొత్తం రూ.1 కోటి 79 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి శంకుస్థాపన చేశారు .ఈ కార్యక్రమం లో భాగంగాసాయిరాం నగర్ బ్యాంక్ కాలనీలో రూ.96 లక్షలతో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి,బీరప్పగడ్డ సౌత్ ప్రశాంత్ నగర్, బొమ్మల బస్తిలో రూ.10.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి,బీరప్పగడ్డ అక్రమ్ ఇంటి ఎదురుగా రూ.19.50 లక్షలతో సీసీ రోడ్డు మరియు స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్‌లైన్‌కు,కుమారి కుంటలో రూ.24 లక్షలతో స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్‌కు,చిల్కానగర్ శివాలయం పక్కన వీధిలో రూ.29 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, చిల్కానగర్ డివిజన్ ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని దశలవారీగా నెరవేరుస్తూ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.
కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ మాట్లాడుతూ, ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలను ప్రాంతాల వారీగా అమలు చేస్తూ చిల్కానగర్ డివిజన్‌లో నిధుల వరద ప్రవహించేలా చేస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు సుమారు రూ.110 కోట్లతో చిల్కానగర్ డివిజన్‌ను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు, డివిజన్ కమిటీ సభ్యులు, వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టెన్షన్ బతుకులు!

భగవంతునికి
భక్తునికి అనుసంధానం
అగర్ బత్తీలు కాదు!
పాపపుణ్యాలు!

పాపం పోవాలంటే
పుణ్యం చెయ్యాలి!
పుణ్యం కావాలంటే
పూజలు చెయ్యాలి!

పూజలు అనేకరకాలు
నవగ్రహపూజలు
కార్తీకదీపారాధనలు
కోటిదీపోత్సవాలు!

అన్న ప్రాసాదాలు
దివ్య సందేశాలు
శివరాత్రి జాగారాలు
ఏకాదశి ఉపవాసాలు!

ఇంకా చాలా ఉన్నాయి
అన్నీ రాయగలమా?
ఈ కాగితం చాలదు!
మీకే బాగా తెలుసు!

ఈ రోజు ఆ భక్తుడు
ఏదోపాపం చేసాడు!
టెన్షన్ తో ఉన్నాడు!

అర్ధరాత్రి వచ్చాడు!

ఎప్పుడుతెల్లారుతుంది?
నిద్రరావటం లేదు!
పొడికళ్ళు పడ్డాయి!
'పాపం' వేదిస్తోంది!

తప్పులుమానవసహజం
అంటారుగాని -తప్పులు
వ్యవస్థాగత లోపాలు!
మనిషినిక్రుంగదీస్తున్నాఇ

రోజూ చేసే పాపాలే!
ఈ రోజు కాస్త ఎక్కువ!
ఏం చేసాడో పాపం!
టెన్షన్ తో ఉన్నాడు!

బతుకులు అలాంటివి!
అమాయకులపై హింస!
తుచ్ఛమైనజీవితాలు
ఎవడి ముల్లె కాజేశాడో!

సంపాదించాలి!
బాగా సంపాదించాలి!
పకోడికంటే ఎక్కువ!
కోట్లకు పడగలెత్తాలి!

ఇంతకంటే పాపాలు
ఇంకేమైనా ఉంటాయా?
లోపల ఏదో ఆతృత!
చెప్పలేని ఆవేదన!

రోజూ ఇదే టెన్షన్!
టెన్షన్ తో బి పి,షుగర్లు!
గుండె దడ, ఆయాసం!
చివరకు తెల్లారింది!

గుడిలో గణ గణ!
గుండెల్లో దడ దడ!
లేవాలనే ప్రయత్నం!
లేవలేకపోతున్నాడు!

ఏమో ఏం జరిగిందో!
అది ఎంత పాపమో!
భక్తునికి భగవంతునికి
అనుసంధానమైనది!

అగర్ బత్తీలు కాదు
పాప పుణ్యాలు!
ఏదో పెద్ద పాపమే!
బతుకు
తెల్లారిపోయింది!

- తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# ఎంజీఎన్ఆర్ఈజిఎ నుంచి గాంధీ పేరు తొలగింపు ప్రజావ్యతిరేక చర్య

◆ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో నిరసన




**మేడ్చల్, డిసెంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు-):** దేశ ప్రజల హక్కైన జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజిఎ) నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ గౌడ్ ఆదేశాల ప్రకారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ నేతృత్వంలో మేడ్చల్ ఎంఆర్వో కార్యాలయం పక్కన ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఈ నిరసన జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "ఎంజీఎన్ఆర్ఈజిఎ నుంచి గాంధీ పేరు తొలగించడం అంటే దేశ ప్రజల మనసుల్లో నుంచి గాంధీ సిద్ధాంతాలను చెరిపివేయాలనే కుట్ర. కోట్లాది పేదలకు ఉపాధి, ఆర్థిక భరోసా ఇచ్చే ఈ పథకాన్ని నిధుల కోతలతో బలహీనపరచి, చివరకు గాంధీ పేరును తొలగించడం బీజేపీ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని వెల్లడిస్తోంది" అని విమర్శించారు.దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రజావ్యతిరేక నిర్ణయాలు వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ నిరసనలో జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కోలన్ హనుమంత్ రెడ్డి, నర్స రెడ్డి, బూపతి రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త అంజి రెడ్డి, సీతారామ్ రెడ్డి, పత్తి కుమార్, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు కపర సాయి గౌడ్, ఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, రామంతపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.అలాగే ఎన్ఎస్‌యూఐ నాయకులు, సీనియర్ నాయకులు, వందలాది కాంగ్రెస్ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.







# లూర్ధుమాత చర్చిలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**ముఖ్య అతిథిగా పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి**

**రామంతాపూర్, డిసెంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం రామంతాపూర్ చర్చి కాలనీలోని లూర్ధుమాత చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. లుకాస్ ఆధ్వర్యంలో పేదలకు బట్టలు పంపిణీ చేశారు.ఫాదర్ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పరమేశ్వర్ రెడ్డి పాల్గొని, క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జానీ, సుధాకర్, సతీష్, వినోద్, డేవిడ్, ప్రవీణ్ కుమార్, భాస్కర్, రత్నారెడ్డి, లుద్ది రెడ్డి, వినయ్, కిరణ్, రాజు, చోటు, చిన్నారావు, రాయన్నలతో పాటు చర్చి ఫాదర్స్ ఫాదర్ ఆనంద్, ఫాదర్ సందీప్, ఫాదర్ ప్రవీణ్ ప్రాంచి తదితరులు పాల్గొన్నారు.సెమీ క్రిస్మస్ వేడుకలు సోదరభావం, సామాజిక సేవా కార్యక్రమాల తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



# పద్మశాలి ముద్దుబిడ్డ సునీల్‌కు ఘన సన్మానం

**రాష్ట్ర విద్యార్థి సంఘ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో**

**పాలకుర్తి , తెలంగాణ ముచ్చట్లు :** పాలకుర్తి పట్టణ కేంద్రంలో 6 వ వార్డు అభ్యర్థి పద్మశాలి ముద్దు బిడ్డ కామారపు సునీల్ అధిక ఓట్ల మెజారిటీ తో విజయం సాధించిన సందర్భంగా పాలకుర్తి పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు చిలుకమారి వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెనుగొండ రమేష్, రాష్ట్ర విద్యార్థి సంఘ అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్, పోపా జనగాం జిల్లా సహాయ కార్యదర్శి చిదురాల ఎల్లయ్య, పట్టణ సలహాదారులు కాటబత్తిని రమేష్, పట్టణ కార్యదర్శి చిలూకమారి సోమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వర్లు, ల్యాబ్ వెంకన్న, చిలుకమారి ఉప్పలయ్య, ఈగ శ్రీను లు తదితరులు పాల్గొన్నారు.





# రాత్రిపూట బయట తిరగవద్దు.. బాలాపూర్ పోలీసులు హెచ్చరిక

**బాలాపూర్, డిసెంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** అత్యవసరమైతే తప్ప అర్ధరాత్రి వేళల్లో ప్రజలు బయటకు రావద్దని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ప్రజలను కోరారు. వరుస హత్యల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది.రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు, డీసీపీ మహేశ్వరం నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో, ఏసీపీ మహేశ్వరం జానకి రెడ్డి పర్యవేక్షణలో బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ నేతృత్వంలో 40 మంది పోలీసులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో విస్తృతంగా రాత్రి పెట్రోలింగ్ చేపట్టారు.అవాంఛనీయ ఘటనలు జరగకుండా అనుమానితులపై నిఘా ఉంచామని, భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేకుండా రాత్రివేళల్లో బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు.అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారు చెడు అలవాట్లకు బానిస కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లలకు కౌన్సెలింగ్ అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.వ్యాపార సంస్థలు ప్రభుత్వ నిర్దేశిత సమయానికి షాపులు మూసివేసి, పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ప్రజల సహకారంతోనే శాంతిభద్రతలు పరిరక్షించవచ్చని పోలీసులు స్పష్టం చేశారు.




# భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ

- **జిల్లా మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ అధ్యక్షురాలు ఈగ శ్వేత రాజు**

**దమ్మాయిగూడ, డిసెంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర మండల పరిధిలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీ హమ్మద్‌గూడ, బండ్లగూడ డబుల్ బెడ్‌రూమ్ ఫేజ్-వన్ ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికులకు లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ విషయాన్ని సీఐటీయూ కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షురాలు ఈగ శ్వేత రాజు చేతుల మీదుగా కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు.ఈ సందర్భంగా ఈగ శ్వేత రాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు వెల్ఫేర్ బోర్డు పథకాలు అందాలంటే ప్రతి కార్మికుడు, కార్మికురాలు బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది పేద కార్మికులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న సీఐటీయూ సంఘాన్ని ఆమె అభినందించారు.అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చింతకింది అశోక్ మాట్లాడుతూ, వెల్ఫేర్ బోర్డులో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి పథకాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల నివాస ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని కార్మిక శాఖను కోరారు. మ్యారేజ్ గిఫ్ట్, మెటర్నిటీ బెనిఫిట్ సహాయాన్ని రూ.50 వేల వరకు పెంచాలని, కార్మికుల పిల్లలకు ప్రతి నెల ఇస్తామన్న రూ.800 స్కాలర్‌షిప్‌కు స్పష్టమైన విధివిధానాలు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల వైద్య పరీక్షల పేరుతో ప్రైవేట్ సంస్థలకు అధికంగా చెల్లింపులు చేయడాన్ని తప్పుబట్టారు. వెల్ఫేర్ బోర్డు నిధులు పూర్తిగా కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని, సి.ఎస్.సి సంస్థను రద్దు చేయాలని కోరారు.అలాగే భవన నిర్మాణ కార్మికులందరికీ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేసి ఉపాధి కల్పించాలని, వలస కార్మికులు, అడ్డా కార్మికుల కోసం 120 రోజులతో కూడిన పట్టణ ఉపాధి హామీ పథకం అమలు చేయాలని కార్మిక శాఖను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈగ రాజు ముదిరాజు, విజయ్ కుమార్, పరుశురాం, రాజు, షేక్ నవాబ్, ప్రసాద్, లక్ష్మీ ప్రసన్న, వసంత తదితరులు పాల్గొన్నారు.





# బాల్య దశలోనే విద్యతో పాటు క్రీడలు ప్రాధాన్యమే..

- **గెలిచిన విజేతలకు బహుతులను అందజేసి అభినందనలు తెలిపిన డాక్టర్ గ్రీష్మ, సీఐ ఉస్మాన్ షరీఫ్.**

**ఖమ్మం బ్యూరో,డిసెంబర్ 21(తెలంగాణ ముచ్చట్లు):** బాల్య దశలోనే విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ప్రాధాన్యమే అని ప్రముఖ గైనిక్ సర్జన్ డాక్టర్ గ్రీష్మ రఘునాధపాలెం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్, స్పందన ఇడా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫౌండర్, అండ్ చైర్మన్ డాక్టర్ ఈడ సామ్యూల్ రెడ్డి
లు అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని స్థానిక సర్దార్ పటేల్ స్టేడియం సమీపంలో గల ఎస్ఆర్ అండ్ బి జి ఎన్ ఆర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం క్రికెట్ నెట్ జట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలి జట్లు రెండు కేటగిరీలలో కూడా ఖమ్మం, మాలిక్ తెనాలి జట్లు స్నేహపూర్వక క్రికెట్ టోర్నమెంట్స్ లో పాల్గొన్నాయి. అండర్ 12 అండర్ 14 కేటగిరిలలో ఈ జట్లు తలపడగా అండర్ 12 విభాగంలో ఖమ్మం జట్టుపై మాలిక్ తెనాలి జట్టు విజయం సాధించగా, అండర్ 14 విభాగంలో మాలిక్ తెనాలి జట్టుపై ..ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం నెట్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ యాంత్రిక యుగంలో క్రీడల అంశంలో శారీరక సౌష్టవాన్ని ఆరోగ్యాన్ని పెంచే విధంగా ఫిజికల్ ఫిట్నెస్ కు అనుగుణంగా క్రీడలు బాల్య దశలోనే ఎంతగానో దోహదపడతాయని వారన్నారు. శారీరక శ్రమతో కూడిన క్రీడలు చిన్నారుల ఎదుగుదలకు ఎంతో తోడ్పాడతాయని చెప్పారు. క్రీడల పట్ల ఎక్కువ మక్కువను చూపుతూ.. విద్యను నిర్లక్ష్యం చేయరాదని విద్యా, క్రీడలు రెండింటిని సమానంగా పరిగణిస్తూ క్రీడాకారుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యకు, క్రీడకు ప్రాధాన్యతను ఇస్తూ.. వారిని ప్రోత్సహించినప్పుడే చిన్నారులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభ, ఉన్నత చదువుల అంశంపై పట్టు సాధించేలా కృషి చేయాలని వారన్నారు..
అనంతరం యువ క్రికెట్ అకాడమీ చైర్మెన్ మాలిక్ (తెనాలి) మాట్లాడుతూ... చిన్నారులు క్రికెట్ పట్ల ఆసక్తితో పాటు క్రీడలో నైపుణ్యతను పెంపొందింప చేసుకోవాలని ఆయన కోరారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు వారు మెడల్స్, జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ నిర్వాహకులు మహమ్మద్ మతీన్, పీఈటీ. ప్రేమ్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ జానీపాషా తదితరులు పాల్గొన్నారు..

# బ్యాంకును మోసం చేసిన ముగ్గురిపై కేసు.!

**సత్తుపల్లి, డిసెంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి డీసీసీబీ బ్యాంకును మోసం చేసిన ఘటనలో సదాశివునిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సత్తుపల్లి డీసీసీబీ బ్యాంకు మేనేజర్ జంగం కిశోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు... సదాశివునిపాలెం గ్రామానికి చెందిన కాల్నెని రాజేశ్ (ఏ-1), కాల్నెని నాగమణి (ఏ-2), కాల్నెని కుమారి (ఏ-3) అనువారు తుంబూరు రెవెన్యూ పరిధిలోని వివిధ సర్వే నెంబర్లలో ఉన్న సుమారు 10 ఎకరాల భూమిని బ్యాంకులో తనఖా పెట్టి రుణం పొందారు.
ఈ రుణానికి సంబంధించి ప్రస్తుతం రూ.63,31,269 బాకీ ఉన్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. అయితే, బ్యాంకుకు సమాచారం ఇవ్వకుండా అదే భూమిని తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఇతర వ్యక్తులకు విక్రయించి మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు నమ్మకద్రోహం, మోసం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరానికి విశేష స్పందన

**నాచారం, డిసెంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం ప్రాంతంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శ్రీ వెంకటేశ్వర భక్త సమాజంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సత్య సాయి బాబా సేవ సమితి, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో విజయవంతంగా నిర్వహించారు .ఈ వైద్య శిబిరంలో దాదాపు 250 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందించారు.



అదనంగా కంటి పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి ఉచిత కంటి అద్దాలు కూడా పంపిణీ చేశారు.ఉచితంగా వైద్యం, మందులు, కంటి అద్దాలు అందించడంపై స్థానిక పేద ప్రజలు నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం నాచారం అధ్యక్షుడు సింగిరికొండ నరసింహ, అధ్యక్షుడు బండల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బొగ్గారపు రమేష్, కోశాధికారి ఎగిన భాస్కర్, ఉపాధ్యక్షుడు గౌరి శెట్టి నరేందర్, సలహాదారులు జూలూరి శ్రీనివాస్, ఎం. రమేష్, జాయింట్ సెక్రటరీ గుండా మహేశ్వమూర్తి, మీడియా కోఆర్డినేటర్ ఆకుతోటి హరిష్ పాల్గొన్నారు. అలాగే కార్యవర్గ సభ్యులు, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రేమ్ కుమార్, సాయి బాబా, శ్రీశైలం, వైద్యులు డా. రాజేంద్ర ప్రసాద్, డా. ఉపేందర్ తదితరులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం..








- జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి వెంపటి అపర్ణ

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ -21(తెలంగాణ ముచ్చట్లు):** లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర న్యాయం దొరుకుతుందని జిల్లా ఇంచార్జ్ ప్రధాన న్యాయమూర్తి, రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి అపర్ణ తెలిపారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం ఆదివారం న్యాయ సేవా సదన్ లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వెంపటి అపర్ణ మాట్లాడుతూ రాజీ పడదగిన అన్ని క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్ ప్రమాద బీమా కేసులను అధిక సంఖ్యలో లోక్ అదాలత్ నందు పరిష్కరించడం జరిగిందని అన్నారు. న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించడం జరిగిందని, లోక్ అదాలత్ తో రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారులకు విలువైన



సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కక్షిదారులు రాజీ పడడం ద్వారా ఇరు పక్షాలు గెలుపొందే అవకాశం ఉందన్నారు. ఇరుపక్షాలు గెలవడం ద్వారా ఇద్దరి మధ్య మంచి వాతావరణం నెలకొంటుందన్నారు. ఖమ్మం అడ్వకేట్ల సంఘం అధ్యక్షులు తొండపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లోక్ ఆదాలత్ ద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. ప్రత్యేక లోక్ అదాలత్ సహకరించిన భీమా కంపెనీలు, పోలీసులను అభినందించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైన ఓ రోడ్డు ప్రమాద కేసులో బాధితుడు తేళ్ల నరేంద్ర సాయి యాక్సిడెంట్ వల్ల చేయి కోల్పోవడంతో శాశ్వత అంగవైకల్యం ఏర్పడడంతో పరిహారం కోసం జిల్లా కోర్టులో కేసు దాఖలు చేయడంతో పిటిషనర్ న్యాయవాది, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాది హరేందర్ రెడ్డి తో మాట్లాడి కేసు రాజీ చేయగా బాధితునికి నష్ట పరిహారంగా 39 లక్షల 50 వేలు ఇవ్వడానికి ఇన్సూరెన్స్ కంపెనీ అంగీకరించడంతో లోకదాలత్ అవార్డు బహుకరించి పూల మొక్క బహుకరించారు. మరో రోడ్డు ప్రమాద కేసులో బాధితునికి 8 లక్షల రూపాయలు ఇవ్వడానికి ఇన్సూరెన్స్ కంపెనీ అంగీకరించడంతో న్యాయవాది బండారుపల్లి గంగాధర్, పిటిషనర్ న్యాయవాది దొబ్బల సురేష్ సమక్షంలో న్యాయమూర్తి అవార్డు బహుకరించారు. ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి గోడిసెల అఖిల 81 కేసు పరిష్కరించారు. న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో కక్షిదారులకు భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు రాం ప్రసాదరావు, సీనయ్య, మురళీమోహన్, శివరంజని, దీప, రజిని, బిందుప్రియ, మాధవి, అఖిల, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, ఇన్సూరెన్స్ ప్రతినిధులు, పోలీస్, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రజా నమ్మకాన్ని నిర్వర్తించాలి..



- రేపల్లెవాడ సర్పంచ్ మడిపల్లి. అంబికాకు సన్మాన కార్యక్రమంలో
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ..

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 21(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలంలో ప్రతి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులందరూ ప్రజలు ఏ నమ్మకంతోనైతే ఓటు వేసి గెలిపించారో ఆ నమ్మకాన్ని బాధ్యతతో నిర్వర్తించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం మండల పరిధిలో రేపల్లెవాడ గ్రామం పంచాయతీ సర్పంచ్ ఏకగ్రీవంగా కావడంతో సర్పంచ్ కి ఘన సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, చింతకాని మండలంలో 26 గ్రామపంచాయతీలలో సిపిఐ కాంగ్రెస్ పొత్తుల్లో గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థు అందరు కూడా తమ గ్రామాలను అభివృద్ధి చేయాలంటే కాంగ్రెస్ పార్టీ తరఫున డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ద్వారా నిధులు మంజూరు చేయడానికి ఆయన సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి ఒక్క సర్పంచ్ ఉప సర్పంచ్లు బాధ్యతతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని అంతేకాకుండా రాజకీయాల కతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసి ప్రజలకు కావలసిన అవసరాలను తీర్చి అందరు మనసుల్లో మీరు గుర్తుండిపోయేలా చూసుకోవాలన్నారు. రాబోయే కాలంలో కూడా ప్రజలు మిమ్మల్ని ఆదరించేలా చూసుకోవాలని, ఎక్కడా కూడా విమర్శలకు తావు లేకుండా చూసుకోవాలని, అభివృద్ధి ధ్యేయంగా పనిచేసుకొని ప్రజల మనల్ని పొందాలని తెలిపారు. ప్రజలకు ఎంత సేవలందించిన ఎన్నికల నన్ను మర్చిపోరని సేవలకు తగిన ప్రతిఫలాన్ని ప్రజలు అందిస్తారని ఆయన తెలిపారు సేవ చేసిన నాయకుడిని గుర్తించే విషయంలో ప్రజలకు ఈ సభ ముఖంగా తెలియజేస్తున్నాం అన్నారు అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచులు మండల నాయకులు రేపల్లెవాడ గ్రామం నుండి ఏకీభవంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మడిపల్లి భాస్కర్ గౌడ్ కోడలు మడిపల్లి అంబికా కు ఘనంగా సాలవులతో బొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్ మక్కపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, నూతనంగా ఎన్నికైన సర్పంచులు దూసరి.నేతాజీ, పర్స.రామచంద్రరావు, ఆవుల. నరసింహారావు, గాదె. రాముడు, కొప్పుల రజిని,కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, సిపిఐ మండల కార్యదర్శి దూసరి. గోపాలరావు, తోటకూరి. హరీష్, ఆళ్ల రవీంద్ర, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చట్టు వెంకటేశ్వర్లు, బందెల.నాగర్జున తిరుపతి గోవిందరావు, రామకృష్ణ పరమ సొసైటీ డైరెక్టర్ కోటేశ్వరరావు, మంకెన. నాగేశ్వరరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో శ్రీ గ్లోబల్ హై స్కూల్ విద్యార్థులకు మొదటి స్థానం...




వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ ఆల్టర్నేటివ్ ప్లాస్టిక్ థీమ్ విభాగంలో సత్తా చాటిన -- వసీఫ్ అక్మల్, పుష్పక్ చంద్ర

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 21(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా పరిధిలోని ఎస్ ఎఫ్ ఎస్ హై స్కూల్ బల్లేపల్లి లో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 2025 సీనియర్ విభాగంలో వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ ఆల్టర్నేటివ్ ప్లాస్టిక్ థీమ్ విభాగంలో శ్రీ గ్లోబల్ హై స్కూల్ విద్యార్థులు అయిన ఎస్.కె వసీఫ్ అక్మల్, కే. పుష్పక్ చంద్ర జిల్లాస్థాయి మొదటి బహుమతిని కైవసం చేసుకోవడం జరిగింది. జిల్లాస్థాయి మొదటి బహుమతిని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డిస్ట్రిక్ట్ క్వాలిటీ కోఆర్డినేటర్ (ఏ ఎమ్ ఓ) పి. ప్రభాకర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని చేతుల మీదగా అందుకోవటం జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 2025లో భాగంగా సీనియర్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో శ్రీ గ్లోబల్ హైస్కూల్ నాగులవంచ నీ నిలబెట్టిన విద్యార్థులను మరియు విద్యార్థులకు సహకరించిన సైన్స్ టీచర్స్ అయినటువంటి పవన్ కుమార్, కృష్ణ నీ కూడా అభినందించడం జరిగింది. ఇంతటి ఘనవిజయాన్ని సాధించినటువంటి విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల బృందం కూడా అభినందించడం జరిగింది.

## అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**పాలకుర్తి , తెలంగాణ ముచ్చట్లు :** పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు చిట్యాల సోమక్క అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకారాన్ని అందించిన వ్యాపార వేత్త తమ్మి రాంబాబుకి ట్రస్ట్ తరుపున కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడి హరీష్, కోశాధికారి ఒగ్రె కుమారస్వామి, మృతురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## వెల్టూర్ గ్రామ నూతన సర్పంచ్ అశోక్‌ను సన్మానించిన జిల్లా మత్స్య సహకార సంఘం

**పెద్దమందడి,డిసెంబర్21(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో నూతనంగా సర్పంచ్‌గా ఎన్నికైన ముదిరాజ్ ముద్దుబిడ్డ దండు అశోక్ కుమార్ (చిట్టి) ని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా మత్స్య సహకార సంఘం గౌరవ సలహాదారు సుక్క శేఖర్ తో కలిసి జిల్లా ప్రధాన ప్రోత్సాహకులు పుట్ట బాలరాజు సర్పంచ్ అశోక్ కుమార్ ను ఆత్మీయంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం సర్పంచ్ అశోక్ కుమార్ మాట్లాడుతూ..తన విజయం కోసం హహర్నిశలు కృషి చేసిన గ్రామ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని మౌలిక వసతుల సమస్యలను పరిష్కరిస్తూ, గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోత్సాహకులు సంద రంగస్వామి, ఉందేకొట్టి నాగేంద్రం, సొప్పరి బీచుపల్లి, సంగనమోని మనోహర్, సంఘం జిల్లా నాయకులు గట్ల ఖానాపూర్ మాజీ సర్పంచ్ కోట్ల వెంకటేష్, మేకల వెంకటస్వామి, వాకిటి బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజల విశ్వాసంతో రెండోసారి గెలిచిన ఏకలవ్య ముద్దుబిడ్డ భార్గవి వెంకటేష్



**అడ్డాకల్,డిసెంబర్21(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్నగర్ జిల్లా అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామంలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఏకలవ్య ముద్దుబిడ్డ మంగరాయి భార్గవి వెంకటేష్‌పై గ్రామ ప్రజలు మరోసారి విశ్వాసం ఉంచి రెండోసారి వార్డు సభ్యురాలిగా ఎన్నుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ చేసిన సేవలకు గుర్తింపుగా ఆమెకు ఈ విజయం దక్కిందని ఆమె తెలిపారు.బలీదుపల్లి గ్రామపంచాయతీ ఎన్నికలు 17122025న జరగగా, సర్పంచ్ ఎన్నికల్లో మొత్తం 1034 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కరుణాకర్ రెడ్డి 647 ఓట్లు సాధించి 431 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఇతర అభ్యర్థులుగా పెద్దమందడి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేణు 216 ఓట్లు, కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థి శ్రీనివాస్ రెడ్డి 147 ఓట్లు, బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ రెడ్డి 14 ఓట్లు పొందారు.గ్రామపంచాయతీకి మొత్తం 10 వార్డులు ఉండగా, కాంగ్రెస్ పార్టీ 8 వార్డులను కైవసం చేసుకోగా, బీఆర్ఎస్ ప్యానల్ రెండు వార్డుల్లో విజయం సాధించింది. 2013 సర్పంచ్ ఎన్నికలతో పాటు 2025లో కూడా భార్గవి వెంకటేష్ రెండోసారి వార్డు సభ్యురాలిగా ఎన్నిక కావడం విశేషం. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి గెలిపించిన వార్డు ప్రజలకు, గ్రామ ప్రజలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలకు ఏ ఆపద వచ్చినా ముందుండి సహాయపడతానని, భూ సమస్యలు, పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన సమస్యలు సహా అన్ని సందర్భాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

## కాకరవాయి మత్స్యకారుల సొసైటీ ఆధ్వర్యంలో చేప పిల్లల పంపిణీ

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 21.(తెలంగాణ ముచ్చట్లు):**

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా కాకరవాయి మత్స్యకారుల సొసైటీ ఆధ్వర్యంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకరవాయి ప్రాంతంలోని పలు చెరువుల్లో చేప పిల్లలను విడిచిపెట్టారు.కాకరవాయి మద్దుల చెరువు, గుడి చెరువు, ముజాహిద్‌పురం పెరికల చెరువుల్లో సొసైటీ ఇన్‌చార్జ్ తబడబోయిన కృష్ణ ఆధ్వర్యంలో మొత్తం రెండు లక్షల నలభై ఐదు వేల (2,45,000) చేప పిల్లలను మత్స్యకారులు చెరువుల్లో వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో చేపల ఉత్పత్తి పెరిగి మత్స్యకారుల ఆర్థిక స్థితి మరింత మెరుగుపడుతుందని తెలిపారు..ప్రభుత్వం మత్స్యకారులకు



అందిస్తున్న సహకారం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం కలుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం మత్స్యకారులు రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మత్స్యకారుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు మత్స్యకారులకు భరోసా కలిగిస్తాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం మత్స్య సంపద పెంపొందించడంలో కీలకంగా నిలుస్తుందని, రానున్న రోజుల్లో మరిన్ని చెరువుల్లో చేప పిల్లల పంపిణీ చేపట్టాలని మత్స్యకారులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండలి ఎల్లయ్య, మండలి వెంకన్న తవడబోయిన నవీన్, మోర ఉప్పలయ్య, మోర గణేష్,యాట పెంటయ్య, తవడబోయిన మల్సూర్, తవడబోయిన మధు, తవడబోయిన సాయి తదితరులు పాల్గొన్నారు..

## ప్రమాణ స్వీకారోత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

### ధర్మసాగర్ సీఐ శ్రీధర్ రావు



**ధర్మసాగర్,డిసెంబర్21(తెలంగాణ ముచ్చట్లు) :** ధర్మసాగర్ మండల పరిధిలోని గ్రామపంచాయతీలలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలని ధర్మసాగర్ సీఐ శ్రీధర్ రావు తెలిపారు.ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా, పూర్తి క్రమశిక్షణతో జరగాలన్నారు. ఈ సందర్భంగా డీజేలు, భారీ శబ్ద వ్యవస్థలు వినియోగించరాదని, అలాగే ర్యాలీలు నిర్వహించడం, రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. పోలీసు శాఖ జారీ చేసిన నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.గ్రామ ప్రజలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించి ప్రమాణ స్వీకారోత్సవాలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించుకోవాలని ఆయన కోరారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# దేశంలో పౌర చైతన్యం క్షీణిస్తున్నదా?



ప్రజాస్వామ్య వ్యవస్థ కేవలం ఎన్నికలు, ఓట్లు, ప్రభుత్వాల మార్పిడికే పరిమితం కాదు. పౌరులలో నైతిక విలువలు, బాధ్యతాయుతమైన ప్రవర్తన, సమాజంపై స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం సజీవంగా నిలుస్తుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, లౌకికవాదం, జాతీయ ఏకత్వం వంటి రాజ్యాంగ విలువలు సమాజంలో బలపడాలంటే అవి చిన్ననాటినుంచే పౌరుల మనసుల్లో నాటుకుపోవాలి. ఇలాంటి విలువలను తీర్చిదిద్దే ప్రధాన సాధనం సామాజిక శాస్త్రాలు. అయితే నేటి పరిస్థితుల్లో ఈ సామాజిక శాస్త్రాలు విద్యా వ్యవస్థలో, సమాజంలో క్రమంగా పక్కకు నెట్టబడుతున్నాయి. ఇది భవిష్యత్ ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హెచ్చరికగా భావించాలి. సామాజిక శాస్త్రాలు లేని విద్యా విధానం సమాజానికి కేవలం ఉద్యోగులు, నిపుణులను మాత్రమే ఇస్తుందిబీ బాధ్యతాయుతమైన పౌరులను కాదు. దేశ భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సామాజిక చైతన్యంపై కూడా ఆధారపడి ఉంటుంది. అందుకే విద్యా విధానంలో సామాజిక శాస్త్రాలకు మళ్లీ కేంద్ర స్థానం కల్పించడం అత్యవసరం.మన దేశం ప్రజాస్వామ్యమని గర్వంగా చెప్పుకుంటున్నప్పటికీ, ఆ ప్రజాస్వామ్యానికి అవసరమైన పౌర చైతన్యం రోజు రోజుకు తగ్గిపోతోంది. వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలు పెరిగి ''నేనునాది'' అనే సంకుచిత భావన సమాజాన్ని కబళిస్తోంది. ఫలితంగా కుల, మత, ప్రాంతీయ విభేదాలు బలపడుతూ, సామాజిక అసమానతలు మరింత పెరుగుతున్నాయి. దీనివల్ల దేశాభివృద్ధే గుదిబండగా మారుతోంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణాల్లో ఒకటి సమాజాన్ని అర్థం చేసుకునే శాస్త్రాలైన చరిత్ర, పౌరశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, భూగోళ శాస్త్రం వంటి సామాజిక శాస్త్రాలపై పెరిగిన నిర్లక్ష్యం. నేటి విద్యా వ్యవస్థలో వైద్య, ఇంజినీరింగ్, శాస్త్రసాంకేతిక, వాణిజ్య విద్యలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే సామాజిక శాస్త్రాలను రెండో స్థాయికి పరిమితం చేస్తున్నాం. సాంకేతిక నైపుణ్యం ఉన్నవారు అవసరమే కానీ, సామాజిక అవగాహన లేని వ్యక్తులతో దేశాన్ని సరైన దిశలో నడిపించడం సాధ్యం కాదు. ఓటు హక్కు ఎందుకు విలువైనది ప్రజాప్రతినిధులను ఎన్నుకునేటప్పుడు ఏ అంశాలను పరిశీలించాలి ప్రభుత్వాలు చేసే విధానాలు మన జీవితంపై ఎలా ప్రభావం చూపుతాయి పౌరులుగా మన బాధ్యతలు ఏమిటి ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత సామాజిక శాస్త్రాలదే. కానీ నేటి తరానికి ఈ అంశాలు సరిగా బోధించబడకపోవడం వల్లే ఓటు విలువ తగ్గిపోతుంది, ప్రజాప్రతినిధుల ఎన్నికల్లో అపసవ్య ధోరణులు పెరుగుతున్నాయి. సామాజిక శాస్త్రాలను కేవలం పరీక్షల కోసమే చదివి ఉద్యోగాలు సాధిస్తే, వాటి అసలైన ఉద్దేశం నెరవేరినట్లుకాదు. చరిత్ర తెలియని తరానికి దేశ గతం అర్థం కాదు. ఆర్థిక శాస్త్రంపై అవగాహన లేనివాళ్లకు అసమానతల అసలు కారణాలు తెలియవు. పౌరశాస్త్రం తెలియకపోతే రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, విధులు స్పష్టంగా అవగతం కావు. ఫలితంగా బాధ్యత లేని పౌర సమాజం తయారవుతుంది. ఈ పరిస్థితుల్లో నైతిక ప్రవర్తన పెంపొందించే మార్గాలపై చర్చ అవసరం. ఈ సందర్భంలో చైనాలో అమలులో ఉన్న సోషల్ క్రెడిట్ స్కోర్ వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా చర్చకు వచ్చింది. పౌరులు చేసే పనుల ఆధారంగా వారికి మంచి లేదా చెడు రేటింగ్ ఇస్తూ, మంచివారికి ప్రోత్సాహం, తప్పులు చేసిన వారికి పరిమితులు విధించే విధానం ఇది. సామాజిక సేవలు, రక్తదానం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయం, పేదలకు దోహదం, కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడం వంటివన్నీ క్రెడిట్ స్కోర్‌ను పెంచుతాయి. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, సామాజిక బాధ్యతారాహిత్యం, తప్పుడు ప్రచారాలు వంటి చర్యలు క్రెడిట్‌ను తగ్గిస్తాయి. ఈ విధానం అక్కడ ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ, నిఘా వ్యవస్థల సహాయంతో అమలవుతోంది. అయితే భారతదేశంలో ఇలాంటి విధానం అమలు చేయాలంటే వ్యక్తిగత స్వేచ్ఛలు, రాజ్యాంగ హక్కులు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయినప్పటికీ నైతిక ప్రవర్తనకు ప్రోత్సాహం ఇచ్చే విధానాలపై కనీసం సమగ్ర చర్చ జరగడం అత్యావశ్యకం. మరింత ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ తరహా బాధ్యత ప్రమాణాలను రాజకీయ పార్టీలకు, నాయకులకు వర్తింపజేయడం. ఎన్నికల హామీలు, పాలనలో పారదర్శకత, అవినీతిపై చర్యలు, ప్రజలకు జవాబుదారీతనం వంటి అంశాలను మదింపు చేసే సోషల్ క్రెడిట్ స్కోర్ సామాజిక పరపతి విలువ (స్వతంత్ర వ్యవస్థ) పరిధిలోకి తీసుకువస్తే.. రాజకీయ అవినీతి గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. అప్పుడే ప్రజాస్వామ్య విలువలు బలపడతాయి. సామాజిక శాస్త్రాలు లేని విద్యా విధానం సమాజానికి కేవలం ఉద్యోగులు, నిపుణులను మాత్రమే ఇస్తుందిబీ బాధ్యతాయుతమైన పౌరులను కాదు. దేశ భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సామాజిక చైతన్యంపై కూడా ఆధారపడి ఉంటుంది. అందుకే విద్యా విధానంలో సామాజిక శాస్త్రాలకు మళ్లీ కేంద్ర స్థానం కల్పించడం అత్యవసరం. ప్రభుత్వాలు, విద్యావేత్తలు, మేధావులు, పౌర సమాజం కలిసి ఈ విషయాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి. సామాజిక శాస్త్రాల పునరుజ్జీవనం లేకుండా ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం సాధ్యం కాదు. విలువలను అర్థం చేసుకుని జీవించే పౌరులే దేశాన్ని నిజమైన అర్థంలో అభివృద్ధి పథంలో నడిపించగలరు.

# సమీకృత పాఠశాలలు.. కావాలి ప్రగతికి ప్రతీకలు



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ స్థాపన. రాష్ట్రంలో దాదాపు ముప్పై సమీకృత పాఠశాలల నిర్మాణానికై మంత్రులు శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలోని కొందుర్గ్ గ్రామంలో శంకుస్థాపన చేశారు. ఈ సమీకృత పాఠశాలల నిర్మాణం పూర్తి అయితే విద్యారంగంలో తెలంగాణ ఒక గొప్ప మైలు రాయిని దాటినట్టే.. విద్యార్థులను విడదీసి విద్యా బోధన చేయడం ద్వారా వారిలో ఒకరకమైన అనారోగ్య విత్తనాన్ని నాటడం జరిగింది. అలా కాకుండా ధనిక, బీద, కుల వివక్ష లేకుండా అందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పించి ఉంటే ఈ పాటికి అందరూ సమానమనే భావం పురుడుపోసుకునేది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నం చేయడం ముదావహం. తెలంగాణ ప్రభుత్వం సంకల్పించిన ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఇంటిలెక్చువల్ స్కూల్స్ కావాలి. అందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్లో తగిన నిధులు కేటాయించి భావి భారత యువతకు బంగారు భవిష్యత్‌ను ఇవ్వాలి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేటి వరకు విద్యారంగంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే మన దేశం గణనీయమైన ప్రగతి సాధించలేదనే చెప్పాలి. మనకన్నా చిన్న దేశాలైన ఫిన్లాండ్, దక్షిణ కొరియా, జపాన్, డెన్మార్క్ అత్యుత్తమ విద్యను అందిస్తున్నాయి. అక్కడ అందరికీ సమాన అవకాశాలున్నాయి. మన దేశంలో ప్రభుత్వ పాఠశాలలు ఉనికిలోకి వచ్చాక ప్రభుత్వాలు విద్య అందరికీ అందుబాటులో తేవాలనే సంకల్పంతో గిరిజన, ఎస్సీ, ఎస్టీ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు స్థాపించారు. ఈ విధమైన వర్గీకరణతో పాఠశాలలు నిర్మించడం వల్ల మంచి కన్నా చెడే జరిగింది అని చెప్పవచ్చు. భారత దేశం కేవలం వివిధ రాష్ట్రాలుగానే కాకుండా ప్రజలు కుల, మతాలు ప్రాతిపదికగా విభజించబడింది. ప్రభుత్వాలు కుల మతాలకు అతీతంగా వ్యవహరించాల్సింది పోయి కుల మతాలను ప్రోత్సహిస్తూ పోషిస్తున్నాయి. తద్వారా కుల మత వ్యవస్థ మరింత వేళ్ళూనుకుంటుంది. విద్యార్థి దశలోనే వారి లేత మనస్సులో ఒక విధమైన వివక్ష, వేర్పాటువాదం బీజం వేస్తుంది. బీద, ధనిక అనే భావం ఏర్పడుతుంది. విద్యార్థులను విడదీసి విద్యా బోధన చేయడం ద్వారా వారిలో ఒకరకమైన అనారోగ్య విత్తనాన్ని నాటడం జరిగింది. అలా కాకుండా ధనిక, బీద, కుల వివక్ష లేకుండా అందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పించి ఉంటే ఈ పాటికి అందరూ సమానమనే భావం పురుడుపోసుకునేది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నం చేయడం ముదావహం. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు సమాన అవకాశాలు ఉంటాయి అని చెప్పారు. కానీ ఆ పాఠశాలల్లో అందరికీ సమాన హక్కులు అవకాశాలు ఉండాలి. అగ్ర వర్ణ లేదా ఇతర కులాలకు (%%)కూడా అంతే అవకాశం కల్పించాలి. విద్యను అభ్యసించడానికి బీదరికం, కులం అడ్డుగోడలు కారాదు. ఇప్పుడున్న హాస్టళ్లు, పాఠశాలలు క్రమేపి పేర్లు మార్చి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌గా మార్చి అందరికీ సమాన స్థాయిలో అవకాశాలు కల్పించాలి. కులం, మతం, బీదరికం, ధనికం అనే వివక్షలేని విద్యను అందించాలి. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన ప్రసంగంలో మాట్లాడుతూ ఎలాంటి కుల మత భేదాలు, విబేధాలు, తారతమ్యాలు లేని సమ సమాజ నిర్మాణానికి బాటలు వేసే ఆధునిక పాఠశాలలు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు అని వర్ణించారు. అదే కనుక నిజం కావాలంటే ఆయా స్కూళ్లను మరిన్ని స్థాపించాలి. ఇప్పుడున్న దీ%, మైనారిటీ విద్యా సంస్థలను ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ గా మార్చాలి. అడ్మిషన్ పక్రియలో కులం, మతం, ఆదాయం అనే కాలమ్స్ తీసివేయాలి. విద్యకు బడ్జెట్లో పెద్ద పీట వెయ్యాలి. ప్రతి విద్యార్థికి నాణ్యమైన ప్రపంచ స్థాయి విద్యను అందించాలి. ఆధునికమైన, నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలలో అందిస్తే ప్రైవేటు విద్యా సంస్థలకు చరమ గీతం పాడవచ్చు. ప్రతి గ్రామ విద్యార్థికి అదే గ్రామంలో పదవ తరగతి వరకు నాణ్యమైన విద్యను అందించాలి. ప్రతి మండలంలో ఇంటిగ్రేటెడ్ జూనియర్ కళాశాలను స్థాపించాలి. అండర్ గ్రాడ్యుయేట్ విద్య విద్యార్థి అభిరుచి మేరకు నేర్చుకునే సౌలభ్యం కల్పించాలి పట్టణాలలో, నగరాలలో జూనియర్ కళాశాల స్థాయి విద్య వరకు తమకి సమీపంలోనే అందే ఏర్పాటు చెయ్యాలి. చదువులకోసం సుదూర ప్రయాణాలు చేయడం విలువైన సమయం వృథా చేయడమే అవుతుంది. విద్య పై పెట్టుబడి భారంగా కాకుండా బాధ్యతగా భావించి భవ్య భారతాన్ని నిర్మించడానికి సోపానంగా ప్రభుత్వాలు భావించాలి.

ఈ డిజిటల్ యుగంలో ఏ ఒక్కరూ విద్యకు దూరం కావద్దు. ప్రపంచంలో 20% జనాభా ఉన్న భారత్ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అయినా విద్యలో సర్వతోముఖాభివృద్ధి సాధించకపోవడం ప్రపంచ స్థాయి విద్యాలయాలు లేకపోవడం, ఉన్నత విద్య కోసం జర్మనీ, కెనడా , బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాల బాటపట్టడం ఎంతైనా విచారకరం. కేవలం విద్య అందివ్వడం, ఉపాధి అవకాశాలకోసం ప్రభుత్వాలపై ఆధారపడేట్లు కాకుండా ప్రతి విద్యార్థి స్వయం చోదక శక్తిగా ఎదిగే విధంగా విద్యా విధానాన్ని మార్చాలి. పాఠశాల స్థాయి నుండే పరిశ్రమలకు విద్యార్థులను అనుసంధానం చెయ్యాలి. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు విద్యార్థి సమగ్ర అభివృద్ధికి దోహదపడాలి. విద్య, ఉపాధికోసం వలసలు పోయే పరిస్థితికి చెక్ పెట్టాలి.. విద్యను అభ్యసించడం అంటే కేవలం అక్షరాస్యులు కావడం కాదు. వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడాలి. శ్రమైక జీవన సౌందర్యానికి విద్యార్థులను తీర్చిదిద్దాలి. చిన్నప్పటి నుండే శ్రమించే తత్వాన్ని పాదుకొల్పాలి. తెలంగాణ ప్రభుత్వం సంకల్పించిన ఇంటిగ్రేటెడ్ స్కూల్స్.. ఇంటిలెక్చువల్ స్కూల్స్ కావాలి. అందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్లో తగిన నిధులు కేటాయించి భావి భారత యువతకు బంగారు భవిష్యత్ ను ఇవ్వాలి.

# ఎలాన్ మస్క్‌కు భారీ ఊరట


## వేతన ప్యాకేజీని పునరుద్ధరిస్తూ కోర్టు ఆదేశాలు

టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు న్యాయస్థానంలో భారీ విజయం లభించింది. 2018లో టెస్లా ఆయనకు ప్రకటించిన 55 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీ విషయంలో డెలావేర్ సుప్రీంకోర్టు నుంచి మస్క్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. టెస్లాను వృద్ధి పథంలో నడిపించినందుకు గాను ప్రోత్సాహకం కింద ఈ ప్యాకేజీని ఆ సమయంలో కంపెనీ ఇవ్వాలనుకుంది. అయితే మస్క్‌కు ఇంత భారీ మొత్తంలో వేతన చెల్లింపుపై అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ కంపెనీకి చెందిన ఒక వాటాదారు కోర్టును ఆశ్రయించారు. మస్క్‌కు అనుకూలంగా ఉన్న బోర్డే ఈ వేతన ప్యాకేజీని రూపొందించిందని, అనుమతుల ప్రక్రియలో నిబంధనలనూ పాటించలేదని పేర్కొంటూ ఆ వేతన ప్యాకేజీని రద్దు చేస్తూ 2024లో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే కింది కోర్టు ఇచ్చిన ఈ ఆదేశాల్లో పలు రకాల లోపాలు ఉన్నాయని చెబుతూ 2018 నాటి వేతన ప్యాకేజీ పునరుద్ధరించాలని తాజాగా డెలావేర్ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.



# తెలుగుకు 'వేదం' ఎనలేని సేవ

పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధమున భారత దేశమంతటా అన్ని భాషలలో నూతన వికాసానికి తెర లేచింది. పాశ్చాత్య నాగరికత, అంగ్ల విద్య ప్రభావాలు ప్రజల వేష భాషలపై అనూహ్య ప్రభావాలు చూపా యి. ఇందుకు తెలుగు భాష, ప్రజలకు మినహాయింపు ఏమీ లేకుండే. ఆ సంధి కాలంలో వేంకటరాయ శాస్త్రి ఆగమనము ఆంధ్రవ్మాయమున క్రొత్త యుగమును సూచిక అయింది.వేదం వెంకటరాయ శాస్త్రి అంటే ఒక ప్రాచీన పండితుడిని తప్ప, అయన గొప్పతనం గురించి, ఆయన తెలుగు భాషకు చేసిన అమూల్య, అపూర్వ సేవల గురించి, అయనచూపిన నూతన మార్గాల గురించి నేటి తరంలో చాలా మందికి తెలియదు. కనీసం శాస్త్రి ఏమి రచనలు చేశారో కూడా నేటి సాహిత్యాభిమానులకు తెలియదు. గద్య పద్య నాటక విమర్శకాది విషయముల లో శాస్త్రి చూపినా మార్గములు అనేకాలు. నాటి కాలంలో శాస్త్రి గ్రంథములు విమర్శకు గురి అయినట్లు ఆధునికులలో ఎవ్వరి గ్రంథాలు కాలేదన్నది వాస్తవం.సుప్రసిద్ధ పండితుడు, కవి, విమర్శకుడు , నాటకకర్త అయిన వేదం వేంకటరాయ శాస్త్రి...వేంకటరమణశాస్త్రి, లక్ష్మమ్మ దంపతులకు డిసెంబర్ 21, 1853న చెన్నైలో జన్మించారు. 1886లో మద్రాసు క్రైస్తవ కళాశాలలో సంస్కృత పండిత పదవిని 25 సంవత్సరాలు సమర్థవంతంగా నిర్వహించారు. 1887లో బి.ఎ. పరీక్షలలో ఆంగ్లం, సంస్కృతంలలో ప్రథమస్థానంలో



ఉత్తీర్ణుడయ్యారు. పరవస్తు చిన్నయసూరికి సహపాఠు లైన, సంస్కృతాంధ్రములలో గొప్ప పండితులు అయిన తండ్రి వేంకటరమణ శాస్త్రి ప్రభావం వేంకట రాయ శాస్త్రి పై పడింది. దాని ప్రభావం వ్యవహార భాషా సాంప్రదాయం అనుసరణకు ప్రేరణ అయింది. 1899లో తెలుగు భాషాభిమాని నాటక సమాజాన్ని స్థాపించారు. ఈ సంస్థలో వెంకటరాయ శాస్త్రి వ్రాసిన నాటకాలని ప్రదర్శించేవారు. ఆయన మూల నాటకాలలో 1897లో వ్రాసిన ప్రతాపరుద్రీయ నాటకం, 1901లో వ్రాసిన ఉషా నాటకం ప్రముఖమైనవి. అనేక సంస్కృత నాటకాలను తెనుగించారు.1916లో సూర్యారాయాంధ్ర నిఘంటువుకు ప్రధాన సంపాదకుడుగా కొంతకాలం పనిచేశారు. అముక్తమాల్యద, శృంగార నైషధ తదితర వ్యాఖ్యలు శాస్త్రి పాండిత్యానికి నిలువుటద్దాలు. ఆముక్త వ్యాఖ్య శతాధిక వసంతాల ను చూసింది. 2461920 నాడు ప్రారంభించి 20101920 నాటికి పూర్తి చేసినట్లు ఆయనే తన జీవిత చరిత్రలో సుస్పష్టంగా చెప్పు కున్నారు. ఆముక్తమాల్యద సంజీవినీ వ్యాఖ్య, భోజ చరిత్రము, శ్రీకృష్ణ దేవరాయ, విజయమునాటకము కథా సరిత్సాగరము పలు భాగాలు, దశకుమార చరితం, శతక వ్మాయ చరిత్ర ప్రథమ సంపుటం, చరిత్ర రచన ప్రథమ భాగం, తెనుగు లఘు వ్యాకరణము వ్యామోహము తదితరుల అయన ప్రముఖ రచనలు. నాగానందం, బొబ్బిలి యుద్ధం, ఉత్తరరామ చరిత, ఆంధ్ర విక్రమోర్వశీయ, ప్రతాపరుద్రీయ, ఉషా నాటకము ప్రియదర్శికాది నాటకములు, అమర కావ్యం, ఆంధ్ర హితోపదేశము చంపువు, శ్రీ శారదా కాంచిక, ఆంధ్ర బిల్హణీయము, విక్రమార్క చరిత్రము, కావ్యాలంకార చూడామణి, మేఘ సందేశం వ్యాఖ్యానం, ఉదయన చరిత్రము, భరతాభారత రూపక మర్యాదలు, తిక్కన సోమయాజి విజయము, ఆంధ్రవ్యాకరణ సర్వస్వ తత్త్వము, ఆంధ్ర భాషా సర్వస్వ నియమ కతిపయములు, ఆంధ్ర సాహిత్య దర్పణము, విమర్శ వినోదము, ఆంధ్ర ప్రసన్నరాఘవ విమర్శనముతానాషా అక్కన్న మాదన్నలు, ఆంధ్ర రత్నావళీ నాటిక, సారంగధర చరిత్రము, పుష్పబాణ విలాసం, రసమంజరీ, కుమార సంభవము వ్యాఖ్య, ఉదయన చరిత్రము, పంచ తంత్రం, ఆంధ్ర దశకుమార చరిత్రము తదితర రచనలు గావించారు. 1920లో ఆంధ్ర మహా సభ చేత 'మహోపాధ్యాయ' బిరుదు పొందారు. 1922లో ద్వారక పీఠ శంకరభగవత్పాదులచేత 'సర్వతంత్ర స్వతంత్ర', 'మహామహోపాధ్యాయ', 'విద్యాదానవ్రత మహోదధి' అనే సత్కారాలు పొందారు.1927లో ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు చేత 'కళా ప్రపూర్ణ' గౌరవంతో సన్మానించ బడ్డారు. 1958లో కుమార సంభవ ప్రబంధకర్త నన్నెచోడుని కవిత్వంపై వీరు రాసిన 'నన్నెచోడుని కవిత్వము' అనే విమర్శనా గ్రంథానికి 'ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి' బహుమతి లభించింది. వెంకటరాయ శాస్త్రి 1929, జూన్ 18న మద్రాసులో మరణించారు.



# జొన్న రొట్టెలు అస్సలు తినకూడదు!

జొన్న రొట్టె ఆరోగ్యానికి మంచిదని చాలా మంది భావిస్తుంటారు. ఫైబర్, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉన్నప్పటికీ, జీర్ణ సమస్యలు, మధుమేహం, గుండెల్లో మంట, మలబద్ధకం లేదా బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్న వారు దీనిని తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ఇది వారి ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేసే అవకాశం ఉంది. ఈ రోజుల్లో జొన్న రొట్టె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చాలా మంది నమ్ముతారు. గోధుమ రొట్టె కంటే దీన్నే ఇష్టపడుతుంటారు. ముఖ్యంగా చలికాలంలో దీనిని తినడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని చెబుతుంటారు. జొన్న రొట్టెలో ఫైబర్, విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది అనేక వ్యాధులు దరికి చేరకుండా చేస్తాయని భావిస్తారు. అయితే, కొంతమంది మాత్రం జొన్న రొట్టెను పూర్తిగా నివారించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణ సమస్యలతో బాధపడేవారు, అంటే కడుపునొప్పి, అసిడిటీ, గ్యాస్, పేగు సిండ్రోమ్ వంటివి ఉన్నవారు దీనిని తినడం వల్ల వారి సమస్యలు తీవ్రతరం కావచ్చు. మధుమేహంతో బాధపడేవారు కూడా జొన్న రొట్టెను మితంగా తీసుకోవాలి. ఇందులో అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఉండటం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు వేగంగా పెరిగే అవకాశం ఉంది. కాబట్టి, డయాబెటిస్ ఉన్న వారు వైద్యుడిని సంప్రదించిన తర్వాతే దీనిని తినడం మంచిది. అదేవిధంగా, గుండెల్లో మంట, మలబద్ధకం సమస్యలు ఉన్నవారు, బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్న వారు కూడా జొన్న రొట్టెను తమ ఆహారంలో చేర్చుకోకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యానికి మేలు చేసే ఆహారం అయినప్పటికీ, కొన్ని పరిస్థితులలో ఇది హానికరం కావచ్చని అంటున్నారు. అలాగే ఏ ఆహారమైనా శరీరానికి మితంగా తింటే ఏ అనారోగ్య సమస్యలు తలెత్తవని.. అధికంగా తీసుకోవడం వల్ల లేనిపోని అనారోగ్య సమస్యలు వస్తాయని.. అందుకే తినే ఫుడ్ ఏదైనా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మీ డైట్‌లోకి ఏదైనా ఆహారాన్ని జత చేస్తే కచ్చితంగా వైద్యున్ని ముందుగా సంప్రదించాలన్నారు.



# వింత పెళ్లి ఆచారాలు.. తంటాలు

పెళ్ళికి సంబంధించిన ఆచారాలూ సంప్రదాయాలూ అన్ని చోట్లా వున్నాయి. వాటిలో కొన్ని చాలా సరదాగా ఉంటే, మరికొన్ని వధూవరులకు నిజంగానే ఇబ్బందులు కలిగించేలా ఉంటాయి. శారీరక కష్టం, మానసిక ఒత్తిడి లేదా వింతైన సవాళ్లతో కూడిన కొన్ని వివాహ ఆచారాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని... 1. 'చోరీ' : బూట్ల దొంగతనం ఉత్తర భారతదేశంలో ఇది మనందరికీ తెలిసిందే. కానీ విదేశీయులకు ఇది పెద్ద 'ట్రబుల్' లా అనిపిస్తుంది. పెళ్ళి పీటల మీద వరుడు కూర్చున్నప్పుడు వధువు తరపు చెల్లెళ్లు వరుడి బూట్లను దొంగిలిస్తారు. ఆ బూట్లు తిరిగి కావాలంటే వరుడు వారికి అడిగినంత డబ్బు ఇచ్చుకోవాలి. కొన్నిసార్లు ఈ బేరసారాలు గంటల తరబడి సాగి, గొడవలకు కూడా దారితీస్తుంటాయి.

2. వధువు కిడ్నాప్: దీనిని 'అలా కచ్చు' అంటారు. ఇక్కడ అబ్బాయి తనకు నచ్చిన అమ్మాయిని తన స్నేహితులతో కలిసి బలవంతంగా కిడ్నాప్ చేస్తాడు. ఆమెను ఇంటికి తీసుకెళ్ళి, పెళ్ళికి ఒప్పించే వరకు అక్కడే ఉంచుతారు. ఇది ఒక నేరమైనప్పటికీ, అక్కడ ఒక సంప్రదాయంగా ఇప్పటికీ కొనసాగుతోంది. ఇది వధువుకు నిజంగానే పెద్ద ట్రబుల్.

3. నోరు విప్పకూడదు : బాలిలో జరిగే కొన్ని సాంప్రదాయ వివాహాల్లో వధూవరులు పెళ్ళి వేడుక ముగిసే వరకు చాలా తక్కువగా మాట్లాడాలి లేదా అసలు మాట్లాడకూడదు. అంతేకాదు, పెళ్ళికి ముందు వధూవరుల పళ్లను కొంచెం ఫైల్ చేస్తారు. పళ్ళను సమానం చేయడం వల్ల వారిలోని కోపం, అసూయ వంటి చెడు గుణాలు పోతాయని వారి నమ్మకం. ఆ నొప్పిని భరించడం ఒక పెద్ద సవాలే.


4. చెమటోడ్చాల్సిందే: కొన్ని స్విస్ సంప్రదాయాల్లో పెళ్ళికి ముందు వధువును ఆమె స్నేహితులు నల్లటి పదార్థాలతో ముంచెత్తడమే కాకుండా, పెళ్ళి రోజున వరుడు ఒక చెక్క మొద్దును గొడ్డలితో సగానికి నరకాలి. వధువు ఆ మొద్దు కదలకుండా పట్టుకోవాలి. అతిథులందరి ముందు ఆ కష్టమైన పనిని త్వరగా పూర్తి చేయకపోతే వరుడిని ఎగతాళి చేస్తారు.

5. నవ్వకూడదు: మనం పెళ్ళిలో నవ్వుతూ ఫోటోలు దిగుతాం. కానీ కాంగోలోని కొన్ని ప్రాంతాల్లో వధూవరులు పెళ్ళి వేడుక మొత్తం నవ్వకూడదు. వారు సీరియస్‌గా ఉంటేనే ఈ పెళ్ళిని వారు సీరియస్‌గా తీసుకుంటున్నారని అర్థం. ఒకవేళ నవ్వితే వారికి పెళ్ళి ఇష్టం లేదని లేదా క్రమశిక్షణ లేదని భావిస్తారు. నవ్వు ఆపుకోవడం అక్కడ పెద్ద ట్రబుల్!

6. వంటల పరీక్ష : జపాన్‌లోని కొన్ని పాత ఆచారాల ప్రకారం, వధువు పెళ్ళి రోజున తెల్లటి మేకప్ వేసుకోవడమే కాకుండా, తలపై ఒక పెద్ద టోపీ ధరించాలి. ఇది ఆమెలోని 'అసూయ కొమ్ములు' కనబడకుండా ఉండటానికట. అంటే పెళ్ళి తర్వాత ఆమె అత్తమామలతో, భర్తతో చాలా అణకువగా ఉండాలని సూచించే ఒక రకమైన మానసిక ఒత్తిడి.


7. వెక్కిరింతల పాటలు: ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో 'గాలి' పాడే ఆచారం ఉంది. వధువు తరపు మహిళలు వరుడిని, అతని తండ్రిని, బంధువులను ఉద్దేశించి బూతులు లేదా వెక్కిరింతలతో కూడిన పాటలు పాడతారు. వరుడి తరపు వారు వీటిని భరిస్తూ నవ్వుతూ ఉండాలి తప్ప కోప్పడకూడదు. ఈ ఆచారాలన్నీ చూస్తుంటే పెళ్ళి అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయికే కాదు, వారి ఓపికకు పెట్టే పరీక్ష అనిపిస్తుంది.

# పిల్లల చేత గుడ్లు ఏ వయసు నుంచి తినిపించాలి




గుడ్డు మంచి పోషకాహారం. ఎన్నో పోషకాలతో నిండి ఉన్న ఈ గుడ్డుని పిల్లలకి పెట్టడం మంచిదే. కానీ, ఎప్పట్నుంచీ ఏ వయసున్న వారి నుంచి పిల్లలకి గుడ్డు పెట్టాలనే సందేహం ప్రతీ ఒక్క తల్లికి వచ్చే ఉంటుంది. ఇంట్లో పెద్దవారు ఉంటే వారికి తోచిన సలహా వారు ఇస్తారు. అయితే, అసలు నిజాలు ఏంటో డాక్టర్‌ని అడిగి తెలుసుకుని ఆ తర్వాత గుడ్డు తినిపిస్తే మంచిది. దీని గురించి డాక్టర్ గౌతమ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో షేర్ చేశారు. అందులో పిల్లలకి గుడ్డు తినిపించే విషయంలో పేరెంట్స్ చేసే మిస్టేక్స్ గురించి చెబుతున్నారు. ఆ మిస్టేక్స్ ఏంటో ముందుగా తెలుసుకోండి. చాలా మంది పేరెంట్స్ చేసే తప్పు ఏంటంటే గుడ్డు మంచిదే అయినప్పటికీ పిల్లలకి ఎప్పుడు తినిపించాలో తెలియక పెద్దగా అయ్యాక తినిపిస్తుంటారు. కానీ, ఎదిగే పిల్లలకి ముందునుంచే తినిపించాలి. 6 నెలల తర్వాత నుంచే ఎగ్ ఎల్లో తినిపించాలి. 8 నెలల తర్వాత నుంచి ఎగ్ వైట్ తినిపించొచ్చు అని డాక్టర్ చెబుతున్నారు. కొంతమంది అపోహ ఏంటంటే ఎగ్ ఎల్లో బ్యాడ్ ఫ్యాట్ అని పిల్లలకి తినిపించరు. కానీ, ఎగ్ ఎల్లో బ్రెయిన్ డెవలప్‌మెంట్‌కి చాలా అవసరం. ఇది పిల్లలకి తినిపించడం అతి ముఖ్యం. పిల్లల బ్రెయిన్ డెవలప్‌మెంట్‌లో ఎగ్ చాలా ముఖ్యం. ఎగ్ ఎల్లోలో గుడ్ ఫ్యాట్ ఉంటుంది. కోలీన్ ఉంటుంది. ఇది పిల్లల్లో మెమరీ పవర్ డెవలప్ అవ్వడానికి చాలా అవసరం. కాబట్టి, ఎగ్ ఎల్లో ఇవ్వాల్సిందే. కొంతమంది పేరెంట్స్ పిల్లలకి ఎగ్ మంచిదని ఉడికించి మాత్రమే తినాలని, వారు చెప్పినట్టుగానే తినాలని అంటారు. కానీ, అలా చేయొద్దు. ఎప్పుడైనా సరే పిల్లలు గుడ్డుని ఎలా తినాలని ఇష్టపడతారో అలానే ఇవ్వండి. ఉడికించి తినాలనుకుంటే అలానే ఇవ్వండి. బుర్జీ, ఆమ్లెట్, ఎగ్ దోశ వేసి ఇలా వారికి నచ్చే విధంగా చేసి తినిపించొచ్చు. కొంత మందికి కొన్ని అపోహలు ఉంటాయి. పౌల్ట్రీ ఎగ్స్ మంచివని, కంట్రీ ఎగ్స్ మంచివని ఎవరికి వారికి బిన్నాభిప్రాయాలు ఉంటాయి. వీటిలో ఏది మంచిదైనా సరే ఎక్కువగా ఉడికించి తినిపించడం మంచిది. ఏ ఎగ్ అయినా అదే పోషకాలు ఉంటాయని గుర్తుపెట్టుకోండి. కొంతమంది పిల్లలకి ఎగ్స్ పడవు. అలాంటప్పుడు వారికి గుడ్లు తినిపించినప్పుడు కొన్ని సమస్యలొస్తాయి. వాటిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. రాషెస్, దురదలు, వాంతులు వంటివి ఉంటే వెంటనే పిల్లల డాక్టర్‌ని కలవడం మంచిది. లేదంటే చాలా సమస్యలొస్తాయి.

## రియల్ ఫైటర్.. రోహిణి గుర్జార్.!



జీవితంలో ఎన్ని దెబ్బలు తగిలినా ధైర్యం.. పట్టుదలతో అసాధ్యాన్ని సుసాధ్యం చేయొచ్చు. రాజస్థాన్‌కు చెందిన రోహిణి గుర్జార్ జీవితంలో కూడా సవాళ్లు.. కష్టాల ప్రయాణమే ఎక్కువ. అయినా ఆమె ఎక్కడా తగ్గలేదు. రాజస్థాన్ అడ్మినిస్ట్రేషన్స్‌లో ఇప్పుడామె పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఎందుకంటే ఆమె రియల్ ఫైటర్. జీవితమంతా సవాళ్ల సంద్రంతో నిండినా ఒడ్డుకు చేరిన ధీర వనిత. రోహిణి.. 2006లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసింది. గ్రూప్స్ సాధించి రాజస్థాన్ ప్రభుత్వంలో మంచి పరిపాలనాధికారి కావాలనేది తన లక్ష్యం. పుట్టినింట్లోనే కాదు.. పెళ్లయ్యాక మెట్టినింట్లో కూడా తనకు పూర్తి మద్దత లభించింది. భర్త కూడా తనతో కలిసి చదువుకునేవాడు. ఇద్దరూ పుస్తకాలు చదువుతూ జీవితంలో ఏ విధంగా పైకి ఎదగాలి అని ఒక ప్లాన్ వేసుకొని భవిష్యత్ కోసం కలలు కనేవారు. ఐతే దురదృష్టవశాత్తు తన భర్త అకాల మరణం చెందాడు. ఆమె కలలు కల్లలైపోయే పరిస్థితి. ఆశలన్నీ అడియాశలయ్యే సిచువేషన్. భర్తే లేనప్పుడు ఈ కలలెందుకు.? అనే స్థితికి వచ్చాయి తన ఆలోచనలు. కుటుంబం రోహిణికి అండగా నిలిచింది. క్రమంగా కోలుకున్న తను.. ఇద్దరి కలల్ని తానొక్కరే నెరవేర్చాలి అని నిశ్చయించుకుంది. దు:ఖం నుంచి బయటకొచ్చి మళ్లీ చదవడం మొదలుపెట్టింది. కష్టాలు వచ్చినప్పుడు మళ్లీ లేచి ఎలా నిలబడాలో రోహిణి నేర్చుకుంది. ప్రిలిమినరీ పరీక్షకు సిద్ధమవుతున్న సమయంలో మరో కష్టం వచ్చింది. భర్త మరణం తర్వాత ప్రతీ సందర్భంలో తనకు అండగా నిలుస్తూ వచ్చిన అత్త చనిపోయింది. అదకూడా ప్రిలిమ్స్ ఎగ్జామ్ రోజునే. ఘొల్లున ఏడుస్తూనే రోహిణి పరీక్ష హాల్‌లోకి వెళ్లింది. భర్తను.. అత్తను గుర్తుచేసుకొని.. తాను చదివినదంతా కరెక్టుగా అప్లయ్ చేసింది. ఇక మెయిన్స్ ప్రిపరేషన్. తన పదేళ్ల కూతురుతో కలిసి మెయిన్స్‌కు సన్నద్ధమైంది. పరీక్షకు ఇంకో ఎనిమిది రోజుల సమయం ఉంది. అంతలోనే మరో అతిపెద్ద కష్టం. తను అల్లారుముద్దుగా పెంచుకున్న పదేళ్ల కూతురు చనిపోయింది. ఒక తల్లికి ఇంతకంటే పెద్ద బాధ ఏముంటుంది? చాలామంది ఇక్కడే ఆగిపోతారు. పరిస్థితులు అలా ఉంటాయి. కానీ రోహిణి ఆ బాధను గుండెల్లో దాచుకుంది. భర్త.. అత్త.. కూతురు ముగ్గురికీ తన విజయంతో ఆత్మశాంతి చేకూర్చాలనుకుంది. తన పోరాటం వృథా కాకూడదని సంకల్పించి ప్రిపరేషన్‌కు ఆటంకం కలగకుండా ముందుకెళ్లింది. పరీక్షకు రెండు రోజుల ముందు జైపూర్‌లో ప్రమాదం జరిగి కంటికి తీవ్ర గాయమైంది. డాక్టర్లు కట్లుకట్టి పూర్తి రెస్ట్ తీసుకోమన్నారు. కానీ అలా చేస్తే తన లక్ష్యం ఏమవుతుందో అనే భయంతో.. ఒక్క కంటితోనే పరీక్ష రాసింది. భర్త.. అత్త.. కూతురు జ్ఞాపకాలను గుండెల్లో దాచుకొని హాల్‌లో కూర్చుంది. ఫైనల్‌గా సెలక్టయింది. ఇప్పుడు రోహిణి గుర్జార్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా మంచి హోదాలో పనిచేస్తోంది. జీవితంలో ఎన్ని దెబ్బలు తగిలినా.. ధైర్యంతో ఒక్క అడుగు ముందుకేస్తే సమస్యలు సమసిపోయి లక్ష్యాన్ని సాధించవచ్చని రోహిణి విజయం నిరూపిస్తోంది. ఆమెకు వచ్చిన కష్టాల ముందు ఏ కష్టమూ తీవ్రమైనది కాదు.

## చలికాలంలో కొన్ని తినొద్దంటున్న న్యూట్రిషనిస్ట్



శీతాకాలంలో ప్రజల ఆహారపు అలవాట్లు మారతాయి. శరీరాన్ని వెచ్చగా ఉంచడం కోసం చాలా మంది వేడి వేడిగా తింటుంటారు. ఇందులో వేడి వేడి బజ్జీలు, పకోడీలు, సూపులు ఉంటాయి. అంతేకాకుండా అమ్మమ్మల కాలం నుంచి ఫేమస్ అయిన డ్రై ఫ్రూట్ లడ్డూలు, క్యారెట్ హల్వా, ఉసిరి మిఠాయి వంటివి కూడా చలికాలంలో తింటుంటారు. ఇక, వేడి వేడి పరాఠాలు, నెయ్యితో వేయించిన కూరగాయలు వంటివి కూడా తింటుంటారు. ఇక, బంగాళదుంపలు, చిలగడదుంపల్ని ఉడకబెట్టుకుని తింటారు. అయితే, వీటిలో చాలా వరకు మన ఆరోగ్యానికి హాని చేసేవే ఉన్నాయి. అంతేకాకుండా వీటిని తినడం వల్ల బరువు కూడా పెరిగే ప్రమాదం ఉంది. అయితే, కొన్ని ఆహార పదార్థాల్ని ఆరోగ్యకరమైనవి భావించి చలికాలంలో ఎక్కువగా తింటుంటారు. అయితే, ఇవి ఆరోగ్యానికి హాని చేస్తాయంటున్నారు. పుణేకు చెందిన న్యూట్రిషనిస్ట్ అమిత గాద్రే. అలాంటి ఫుడ్స్ లిస్ట్‌ను కూడా తన ఇన్‌స్టా ఖాతాలో అందించారు. చలికాలంలో ఉసిరి కాయలు ఎక్కువగా లభిస్తాయి. ఉసిరి కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తి పెంచడంలో సాయపడుతుంది. అందుకే ఉసిరి ఆరోగ్యానికి మంచిదని అమిత చెబుతుంది.

అయితే, ఉసిరి మిఠాయి ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు అమిత. ఎందుకంటే ఇందులో చక్కెర పుష్కలంగా ఉంటుంది. ఆమ్లా క్యాండీ తినే బదులు.. తాజా ఉసిరిని తీసుకోమని సలహా ఇస్తున్నారు. ఉసిరిని తురుముకుని చట్నీ, గంజి, కూరల్లో వాడుకోమని ఆమె సూచిస్తున్నారు.

చలికాలంలో చాలా మంది ఆరోగ్యానికి మంచిదని చ్యవన్‌ప్రాష్ తింటుంటారు. అంతేకాకుండా పిల్లలకు కూడా తినిపిస్తారు. అయితే, చ్యవన్‌ప్రాష్‌లో కూడా ఎక్కువ చక్కెర ఉంటుదని అమిత హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా అనేక అధ్యయనాలు చ్యవన్‌ప్రాష్‌లో భారీ లోహాల ఉనికిని వెల్లడించాయి. అందుకే ఇది పిల్లలకు మంచిది కాదు. దీన్ని చలికాలంలో ఎట్టి పరిస్థితుల్లో తినొద్దని అమిత సూచిస్తున్నారు. దీనికి బదులు తాజా కూరగాయలతో చేసిన సూప్ తాగమంటున్నారు అమిత. డ్రై ఫ్రూట్స్‌తో చేసిన లడ్డూల్ని చలికాలంలో ఎక్కువగా తింటారు. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. అయితే, వీటిలో కేలరీలు చాలా ఎక్కువగా ఉంటాయి. ఉదహరణకు ఒక డ్రై ఫ్రూట్ లడ్డూలో దాదాపు 200 కేలరీలు ఉంటాయని అమిత వివరిస్తున్నారు. బరువుతో పాటు బెల్లీ ఫ్యాట్ తగ్గించుకోవాలని ప్రయత్నిస్తున్నవారు.. ఈ లడ్డూల్ని ఎట్టి పరిస్థితుల్లో తినకూడదని సలహా ఇస్తున్నారు. వీటికి బదులు గుప్పెడు గింజలు, డ్రై ఫ్రూట్స్ తినమని సలహా ఇస్తున్నారు. చలికాలంలో చాలా మంది ఉదయం నిద్ర లేవగానే ఒక టీ స్పూన్ నెయ్యి తింటారు. ఇది ఆరోగ్యానికి చాలా మంచిదని భావిస్తారు.

# టమాటా తీసుకుంటే కిడ్నీల్లో రాళ్ళా!



ఇటీవలి కాలంలో కిడ్నీలో రాళ్ల సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా యువత కిడ్నీ రాళ్ల సమస్యతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో చాలా మందికి అసలు కిడ్నీల్లో రాళ్లు ఎందుకు ఏర్పడతాయనే దానిపై సందేహాలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో కిడ్నీలో రాళ్ల సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా యువత కిడ్నీ రాళ్ల సమస్యతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో చాలా మందికి అసలు కిడ్నీల్లో రాళ్లు ఎందుకు ఏర్పడతాయనే దానిపై సందేహాలు ఉన్నాయి. ఈ క్రమంలో కొందరు టమాటా తిరడం వల్ల కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయని భావిస్తుంటారు. దీంతో టమోటాలు తినకుండా ఉంటారు. రోజూ ఆహారంలో భాగంగా టమోటాలను తినడం వల్ల లేదా ఆహారంలో ఏదో ఒక విధంగా ఉపయోగించడం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయనేది వీరి నమ్మకం. కాబట్టి మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయేమోనన్న భయంతో టమోటాలు తినడం మానేస్తుంటారు. టమోటాలు తినడం వల్ల కిడ్నీలో రాళ్లు వస్తాయనే నమ్మకాన్ని ఆరోగ్య నిపుణులు కొట్టిపారేస్తున్నారు. టమోటాలలో ఉండే ఆక్సలేట్ కంటెంట్ వల్ల కిడ్నీలో రాళ్లు వస్తాయని సాధారణంగా అందరూ భావిస్తుంటారు. అయితే, ఈ కూరగాయలో చాలా తక్కువ మొత్తంలో ఆక్సలేట్ ఉంటుంది. అంటే 100 గ్రాముల టమోటాలలో కేవలం 5 మిల్లీగ్రాముల ఆక్సలేట్ మాత్రమే ఉంటుంది. ఇంత తక్కువ మొత్తంలో కిడ్నీలో రాళ్లు రావడానికి సరిపోదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. మూత్రపిండాల్లో రాళ్లు రావడానికి ప్రధాన కారణం సాధారణంగా డీహైడ్రేషన్. ఏదైనా పని చేసే వారు ఎవరైనా ప్రతిరోజూ కనీసం 2.5 నుంచి 3 లీటర్ల నీళ్లు తాగడం చాలా ముఖ్యం. ఎందుకంటే కొన్ని ఎంజైమ్‌ల లోపాలు, జీవక్రియ సమస్యల వల్ల కూడా మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడవచ్చు. ఆక్సలోసిస్ అనే అరుదైన జీవక్రియ రుగ్మత కారణంగా మూత్రపిండాలు శరీరం నుంచి కాల్షియం ఆక్సలేట్ స్ఫటికాలను మూత్రం ద్వారా విసర్జించడం ఆపివేస్తాయి. ఇది మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# అంబేద్కర్ ఆశయాల కొనసాగింపులో యువత ముందుండాలి

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):
అంబేద్కర్ ఆశయాలను కొనసాగించడానికి యువత ముం దుండాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో అంబేద్కర్ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబే ద్కర్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ ఆలోచన వి ధానం ముందుకు తీసుకుపోవాలని సూచించారు. బో ధించు.. సమీకరించు.. పోరాడు.. అంటూ అంబేద్కర్ సమాజంలో జరుగుతున్న వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారని తెలిపారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజల కోసం రాజ్యాంగం రాసారని పే ర్కొన్నారు. వేములవాడ నియోజకవర్గాన్ని, కోనరావు పేట మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపా రు. మల్కపేట రిజర్వాయర్ మెయిన్ కెనాల్ ద్వారా ఎల్లారెడ్డిపేటలో సాగు నీరందించడం జరిగిందని తెలి పారు. ఎడమ కాలువ ద్వారా మారుపాక వరకు సాగు నీరు పంపిణీ చేయడం జరిగిందని, రానున్న వేసవి కాలం దృష్ట్యా ప్రాజెక్టులో నీటిని నిల్వ చేసుకోవడం జరిగిందన్నారు. మండల పరిధిలో నాగారం, మంగళప ల్లి గ్రామాలకు రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. నూతన బ్రిడ్జిల నిర్మాణం చేపడుతామని తెలి పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఇందిర మ్మ రాజ్యంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామాల్లో పే ద ప్రజలకు పక్క ఇల్లు ఉండాలని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయ డం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన పథకాలను రద్దు చేయకుండా నూతన పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని తెలిపారు. పల్లిమక్తలో గ్రామ పం చాయతీ భవనం నిర్మాణానికి నిధు లు మంజూరుచేస్తానని హామీ ఇ చ్చారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, సర్పంచ్ జిన్న అనూష, అనిల్, శ్రీధర్, జాన్, సురేష్, విజయ్, కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్ నాయిని ప్రభాకర్‌రెడ్డి,సాసాల రాజు, నీరటి సం జీవ్, ఉప్పుల గంగయ్య, సుంకరి రెడ్డి, అవురం సురేష్, వాసంపల్లి శ్రీనివాస్, ప్రభాకర్, మల్లేశం, పాల్గొన్నారు.

# 'నదీజలాల సమస్యలకు కేసీఆర్, హరీశ్‌రావు తప్పిదాలే కారణం'

(మొదటి పేజీ తరువాయి)
ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్‌ఎస్‌ఎల్‌పీ సమావేశంలో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్పందించారు. కేసీఆర్ ప్రజా జీవితంలో ఉంటే సంతోషమేనన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని తాము కోరుకుంటున్నామని పేర్కొన్నారు.
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఆయన కుమార్తె కల్వకుంట్ల కవిత గురించి కేసీఆర్ ఏం వివరణ ఇస్తారో చూద్దామని తెలిపారు. అలాగే రాష్ట్రంలో గతంలో చేసిన అప్పులపై కేసీఆర్ ఏం సంజాయిషీ ఇస్తారో వేచి చూద్దామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటుందని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో తాము 70 శాతం గెలిచామని పేర్కొన్నారు. ఇక బీఆర్‌ఎస్ ఎక్కడుంది? అంటూ ఆయన ప్రశ్నించారు.
తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర మంత్రి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిపై నిప్పులు చెరిగారు. కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి తెలంగాణకి తెచ్చింది ఏమైనా ఉందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. కేంద్రంలో మీ 12 ఏళ్ల పాలనపై.. తెలంగాణలో తమ రెండేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సవాల్ విసిరారు.
రాష్ట్ర అభివృద్ధికి కిషన్ రెడ్డి మోకాలు అడ్డు పెడుతున్నారంటూ మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణను కేంద్ర మంత్రి



కిషన్ రెడ్డి అడ్డుకున్నారని విమర్శించారు. సోనియా గాంధీ ఇచ్చిన హామీల్లో మెజార్టీ అంశాలను ఇప్పటికే తాము నెరవేర్చామని ఆయన స్పష్టం చేశారు.
ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం, రాష్ట్రకార్యవర్గ సమావేశం జరిగింది. దీనిలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యవర్గ సభ్యులతో కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మెరుగైన ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు.. తనను దూషించడమే రాష్ట్ర ప్రభుత్వ విధానమని విమర్శించారు.

# వీబీ–జీ రామ్ జీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) స్థానంలో మోదీ సర్కారు ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం సంతకం చేశారు. దాంతో అది వీబీ-జీ రామ్ జీ చట్టం-2025గా అమల్లోకి వచ్చింది. ఈ మేరకు గెజిట్ ఆఫ్ ఇండియాలో నోటిఫికేషన్ కూడా వెలువడింది.
గ్రామీణ ఉపాధి, అభివృద్ధి సాధన దిశలో ఇది కీలక మైలురాయిగా నిలవగల సంస్కరణ అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఒక ప్రకటన



లో పేర్కొంది. 2047కల్లా భారత్ ను వికసిత దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనలో భాగంగానే కొత్త చట్టాన్ని తెచ్చినట్టు కేంద్రం వివరించింది. దీనికింద గ్రామీణులకు ఏటా కనీసం 125 పనిదినాలు కల్పించనున్నారు. ఈ బిల్లును నిరసనలు, ఆందోళనల మధ్యే గత వారం పార్లమెంటులో ప్రవేశపెట్టడం తెలిసిందే.
తమ హయాంలో వచ్చిందన్న ఒకే ఒక్క కారణంగా చరిత్రాత్మక ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏను కక్ష కొద్దీ మోదీ సర్కారు రద్దు చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. వీటిని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివ రాజ్ పాటిల్ తోసిపుచ్చారు. కొత్త చట్టంపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు. ఇది ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కన్నా ఒకడుగు ముందున్న చట్టం' అని ఆదివారం ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.
పౌర అణు శక్తి రంగంలోకి ప్రైవేటు భాగస్వాములను కూడా అనుమతించేందుకు ఉద్దేశించిన సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫర్మింగ్ ఇండియా (శాంతి) బిల్లుకు కూడా రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఆ బిల్లుపై శనివారం ఆమె సంతకం చేశారు. ఆదివారం వెలువడ్డ కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్ ఈ మేరకు పేర్కొంది. 1962 నాటి అటామిక్ ఎనర్జీ యాక్ట్, 2010 నాటి సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్ స్థానంలో దీన్ని తీసుకొచ్చారు.

# కాంగ్రెస్‌పై మోదీ నిప్పులు.. దేశ వ్యతిరేక శక్తిగా ఆరోపణ



ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి నిప్పులు చెరిగారు. దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో ఆ పార్టీ తలమునకలుగా ఉందని మండిపడ్డారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులు అసోంలో స్థిరపడేందుకు అన్నివిధాలా సాయం చేస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. 'అందుకే ఓటర్ల జాబితా సవరణను కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఓటు బ్యాంకు తప్ప దానికి మరేమీ పట్టదు.
ఎలాగైనా అధికారాన్ని ఒడిసిపట్టడమే ఆ పార్టీ ఏకైక లక్ష్యం' అని ఎద్దేవా చేశారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలున్న అసోంలో దిబ్రుగడ్ జిల్లాలోని నామ్ రూప్ లో రూ.10,601 కోట్లతో నిర్మించిన భారీ ఎరువుల కర్మాగారాన్ని ఆదివారం ప్రధాని ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ కాంగ్రెస్‌ను దునుమాడారు. ''ఆ రాష్ట్రంపై దానిది ఎప్పుడూ సవతి ప్రేమే. అస్సామీల అస్తిత్వం, సంస్కృతి, ప్రతిష్ఠ కాంగ్రెస్‌కు ఏనాడూ పట్టలేదు.
వాటి పరిరక్షణకు పాటుపడుతున్నది బీజేపీ మాత్రమే. కాంగ్రెస్ అనే విషం బారినుంచి అస్సాంను కాపాడాల్సిన అవసరముంది . ఈ విషయంలో బీజేపీ ఒక కవచంలా నిలుస్తుంది' అన్నారు. రాష్ట్రంలో దశాబ్దాల హింసాకాండకు శాశ్వతంగా తెర దించేందుకు బీజేపీ ఎంతో కృషి చేస్తోందన్నారు. నాటి అహోం రాజా వంశ పాలనలో ఉన్నంత శక్తిమంతంగా అసోంను తీర్చిదిద్ది తీరుతామన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని మోదీ చెప్పారు.
దేశానికి కాంగ్రెస్ ఎన్ని ద్రోహాలు చేసిందో లెక్కే లేదని మోదీ అన్నారు. దాంతో, 12 ఏళ్లుగా తమ సర్కారు ఎంతగా సరిచేస్తున్నా, ఇంకా చక్కదిద్దాల్సిన తప్పిదాలు ఎన్నో ఉన్నాయని చెప్పుకొచ్చారు. 'అసోం ఆణిముత్యం భూపేన్ హజారికాకు భారత రత్న ప్రకటిస్తే బాహాటంగా వ్యతిరేకించిన చరిత్ర కాంగ్రెస్ ది! 'ఆడిపాడే వారికి మోదీ భారతరత్న ఇస్తున్నాడు' అంటూ ఎద్దేవా చేసి అస్సామీల మనసులకు తీరని గాయం చేసింది' అని మండిపడ్డారు.
రాష్ట్రంలో సెమీ కండక్టర్ విభాగం ఏర్పాటు చేసినా వ్యతిరేకించిన కాంగ్రెస్ ను ఏమనాలో కూడా అర్థం కావడం లేదన్నారు. పారిశ్రామికీకరణ, కనెక్టివిటీ అస్సాం కలలు క్రమంగా సా చేస్తున్నాయంటూ హర్షం వెలిబుచ్చారు. సభకు మహిళలు భారీగా తరలిరావడం హర్షణీయమని మోదీ అన్నారు. ఇటీవల రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తో తాను భేటీ అయినపుడు ఆయనకు అసోం బ్లాక్ టీ పొడి కానుకగా ఇచ్చినట్టు గుర్తు చేశారు.
ప్రధాని మోదీ ఆదివారం ఉదయం అసోంలో బ్రహ్మపుత్రా నదిలో బోటు షికారు చేశారు. వినూత్నంగా క్రూయిజ్ షిప్ లో విద్యార్థులతో గంటపాటు పరీక్షా పే చర్చా కార్యక్రమం జరిపారు. పలు స్కూళ్లకు చెందిన 25 మంది స్టూడెంట్లు ఇందులో పాల్గొన్నారు. అంతకుముందు గువాహ తిలో అసోం ఆందోళన అమర వీరుల స్తూపం వద్ద మోదీ ఘనంగా నివాళులు అర్పించారు. అసోంలోకి అక్రమ చొరబాట్లను వ్యతిరేకిస్తూ చేపట్టిన స్వహిద్ సమరక్ ఉద్యమంలో 860 మందికి పైగా అసువులు బాశారు. ఇందుకు గుర్తు నిర్మించిన స్వహిద్ సమరక్ క్షేత్ర వద్ద వెలిగే నిత్య ప్రమిదకు మోదీ ప్రణమిల్లారు. ఆయన రెండు రోజుల అసోం పర్యటన ఆదివారంతో ముగిసింది.







# రైలు టికెట్ల ధరల పెంపు!

రైలు ప్రయాణికుల చార్జీలు పెంచుతూ.. భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రైలు స్థాయిని బట్టి కిలో మీటరుకు 1 నుంచి రెండు పైసల చొప్పున పెంచుతున్నట్టు తెలిపింది. ఈ పెంపు ఈ నెల 26 నుంచి అమల్లోకి రానుంది. తద్వారా రైల్వేకు రూ.600 కోట్ల మేరకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని వివరించింది. 215 కిలోమీటర్ల దూరాన్ని మించి ప్రయాణించే వారికే ఈపెంపు వర్తిస్తుందని రైల్వే శాఖ తెలిపింది. ఆర్డినరీ రైళ్లలో 215 కిలో మీటర్లు దాటి ప్రయాణించే వారికి.. కిలోమీటరుకు 1 పైసా చొప్పున, మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ, ఏసీ తరగతుల్లో ప్రయాణించే వారికి కిలో మీటరుకు 2 పైసల చొప్పున టికెట్ ధరలు పెరగనున్నాయి. నాన్‌ఏసీ రైళ్లలో 500 కి.మీ. దూరం ప్రయాణించే వారు.. రూ.10 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక, సబర్బన్, నెలవారీ సీజన్ టికెట్‌లు తీసుకునే వారికి ఈ పెంపు వర్తించదు. కాగా.. ఈ ఏడాదిలో టికెట్ ధరలు పెంచడం ఇది రెండోసారి. ఈ ఏడాది జూలైలో పెంచిన టికెట్ ధరలతో శాఖకు రూ.700 కోట్లకుపైగా అదనపు ఆదాయం చేకూరింది. కాగా, క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 8 జోన్లలో 244 అదనపు రైళ్లను నడపనున్నట్టు రైల్వే శాఖ తెలిపింది. ప్రయాణికుల అవసరాలు, రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. అవసరాన్ని బట్టి మరిన్ని రైళ్లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్టు వివరించింది. 2014 25 మధ్య కాలంలో 2 లక్షల వ్యాగన్లను సమకూర్చుకున్నట్టు శాఖ వివరించింది. అదేవిధంగా 10 వేలకుపైగా లోకోమోటివ్‌లను పెంచినట్టు తెలిపింది.
డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డీఎఫ్‌సీ) ఏర్పాటుకు కేంద్రం ఆగమేఘాలపై చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో పార్లమెంటరీ స్థాయీ సంఘం ఈవ్యవహారంపై ఆక్షేపణ వ్యక్తం చేసింది. తగిన సిబ్బంది లేకుండా.. డీఎఫ్‌సీ ప్రయోగం ఎందుకని ప్రశ్నించింది. నిపుణులైన సిబ్బంది డీఎఫ్‌సీకి అవసరమని పేర్కొంది. కానీ, ప్రస్తుతం సిబ్బంది లేరని.. ఇది ప్రధాన సవాలుగా మారుతుందని అభిప్రాయపడింది. డీఎఫ్‌సీ కింద హైకెపాసిటీ ట్రాక్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా మరింత సమర్థవంతంగా, వేగంగా రైళ్లను నడపాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే.. లక్ష్యం బాగున్నా సిబ్బంది లేకపోవడాన్ని పార్లమెంటరీ స్థాయీ సంఘం తప్పుబట్టింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ కూడా అంగీకరించడం గమనార్హం. లోకో పైలట్లు 1,42,814 మంది ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 1,07,928 మంది మాత్రమే ఉన్నారు. గూడ్స్ ట్రైన్ మేనేజర్లు 22,082 మంది ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 12,345 మంది మాత్రమే ఉన్నారు. అదేవిధంగా స్టేషన్ మాస్టర్లు 2,06,495 మంది ఉండాల్సి ఉండగా.. 1,59,219 మంది మాత్రమే ఉన్నారు. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని స్థాయీ సంఘం స్పష్టం చేసింది.

# శబరిమల గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌ఫోర్టు భూసేకరణ నోటిఫికేషన్ రద్దు

కేరళ ప్రభుత్వానికి హైకోర్టు షాక్ ఇచ్చింది. శబరిమల గ్రీన్‌ఫీల్ ఎయిర్‌ఫోర్టు భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేసింది. ఎయిర్‌ఫోర్టు భూసేకరణ రద్దు కోరుతూ గోస్పెల్ ఆశియా అనే సంస్థ కోర్టులో పిటిషన్ వేసింది. తాజాగా దానిని విచారించిన కోర్టు ఆ నోటిఫికేషన్ రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.
కేరళ ఎరుమేలిలో నిర్మించబోయే గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌ఫోర్టుకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ విమానాశ్రయం కోసం 2570 ఎకరాల భూమి సేకరణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఎయిర్‌ఫోర్టు ఆఫ్ ఇండియా అథారిటీ ప్రకారం పెద్ద విమానాశ్రయాల నిర్వహణకు సైతం 1200 ఎకరాల భూమి సరిపోతుందని నియమం ఉంది. ఈ నేపథ్యంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్వహణ కోసం అంత పెద్దమొత్తంలో భూసేకరణ ఎందుకు జరుపుతున్నారో వివరణ ఇయ్యాలని కోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే భవిష్యత్తు అభివృద్ధి కోసం స్థల సేకరణ చేపడుతున్నామని ప్రభుత్వం వాదనలు వినిపించింది. దీనికి సంతృప్తి చెందని కోర్టు స్థల సేకరణ నోటిఫికేషన్‌ను కొట్టివేసింది. ఎరుమేలిలో నిర్మించబోయే గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు శబరిమల అయ్యప్ప సన్నిధానానికి 48 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌ఫోర్టు నిర్మించాలని భావించింది. కోర్టు తీర్పుతో ఎయిర్‌ఫోర్టు నిర్మాణానికి బ్రేక్ పడింది.




Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896